






ముసురు.. ముంపు

అల్పపీడనం.. రైతులను ముంచేస్తోంది. పైరు నీటి పాలైంది. ఈదురుగాలులకు నేలవాలింది. కోతలకు సిద్ధమైన వరి చేతికి అందదేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడుతున్నాయి. మంగళ వారం అర్ధ రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ముసురు పట్టినట్లు వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం పంటల కు మేలు చేయగా కంకి దశలో ఉన్న వరి, తీత దశలో ఉన్న పత్తి తదితర పంటలకు నష్టం చేసింది. కృష్ణా తీరంలోని లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు వర్షం మేలు చేసింది. వరదలకు పంట దెబ్బ తిన్న చేలల్లో మినుము విత్తిన రైతు లకు మాత్రం మళ్లీ నష్టం తప్ప దని చెబుతున్నారు. పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు జలమయంగా మారడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- అల్పపీడనంతో వీడని వర్షాలు
- పంటలు వర్షార్పణం.. రైతుల ఆందోళన
- కంకి దశలో వరి.. దిగుబడులపై తీవ్ర ప్రభావం

తెనాలి, గుంటూరు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి గుం టూరు జిల్లాలో బుధవారం భారీ వర్షాలు పడ్డాయి. ఎన్నో వ్యయ ప్రయాసలతో సాగు చేసిన వరి చేతికొచ్చే సమయంలో వర్షాలకు నేలవాలిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న పైరు నేలవాలి వర్షపు నీటిలో నానుతుంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సాగు 5.73 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఈ వర్షాలు రైతులను దెబ్బతీస్తున్నాయి. గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, బాపట్ల జిల్లాలోని కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, రేపల్లె తదితర మండలాల్లో ఇప్పటికే వరి కంకులు వచ్చి, గింజ పాలుపోసుకునే దశలో ఉంది. కంకులు రాని పంటకు వర్షం మేలు చేస్తే, కంకి వేసిన పంటకు మాత్రం నష్టం తప్పడంలేదని రైతులు చెబుతున్నారు. గింజ పాలుపోసుకునే దశలో వర్షం ఎక్కువగా ఉంటే, గింజ తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గింజ పాలుపోసుకున్న చేలల్లో మాత్రం ముసురు కారణంగా మానుకాయ వల్ల కూడా నష్టం తప్పడంలేదంటున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరి పంట నేలవాలింది. కంకులు బరువు లేకున్నా కొన్ని చేలు చాపలా పరుచుకున్నాయి. దీంతో రైతులకు పంటను పైకి నిలబెట్టుకోవడం తలకుమించిన పని అవుతోంది. అరటి, బొప్పాయి, కంద, పసుపు పంటలు గత వరదలకు దెబ్బతినగా, మిగిలిన వాటికి వర్షం మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. వరదల తర్వాత మళ్లీ మినుము చల్లిన రైతులకు ఈ వర్షం నిరాశ మిగిల్చింది. మరోసారి ఆ రైతులకు నష్టం తప్పడంలేదు. మొక్క ఇప్పుడిప్పుడే బయటకు వస్తుంటే, వర్షం ముంచేయడంతో అదికాస్తా దెబ్బతినపోతుందని, మరోసారి విత్తాల్సిందేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి వంటి పట్టణాల్లో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. అటు బాపట్ల జిల్లాలోని


(మిగతా 8వ పేజీలో)



గుంటూరు : జలమయమైన స్తంభాలగరువులో ఓ వీధి

జిల్లాలో భారీగా వర్షం

గుంటూరు: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.



నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు హెచ్చరిక

రేపల్లె: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. బుధవారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సము ద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు బోట్లు వేసుకుని తిరుగు ప్రయాణమై హార్బర్‌కు చేరారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు బంద్!



గత 14 రోజులుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. పేద రోగులు అత్యవసర పరిస్థితుల్లో సొమ్ము చెల్లించి వైద్యం చేయించుకోవాల్సిన దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ వైద్యశాలల మధ్య బిల్లుల బకాయి రగడ నడుస్తోంది. బకాయి చెల్లింపుల అంశంలో పలుమార్లు ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆస్పత్రుల నిర్వాహకులు ఉచిత వైద్య సేవలను నిలిపివేశారు. బకాయి విడుదల కోరుతూ ఆందోళన బాట పట్టారు. గురువారం చలో విజయవాడకు నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ పిలుపు నిచ్చింది. పల్నాడు జిల్లాలో 111, గుంటూరు జిల్లాలో 128, బాపట్ల జిల్లాలో 60 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉచిత వైద్య సేవలను నిలిపివేసినట్లు యూనియన్ నేతలు తెలిపారు.

ఉచిత వైద్యసేవలను నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

- వైద్యం అందక పేద రోగుల ఇక్కట్లు
- బిల్లుల విడుదల కోసం వైద్యుల ఆందోళన బాట
- నేడు చలో విజయవాడ

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను కొంత మేర చెల్లించింది. అయితే పాత బకాయిలతో పాటు కొత్త బకాయిలు పేరుకుపోయాయి. దీంతో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేసి బకాయి (మిగతా 8వ పేజీలో)



నరసరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న నెట్ వర్క్ ఆస్పత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది

పిడుగుపాటుకు కూలిన జీవితాలు

- ఇద్దరు మహిళా కూలీల మృతి..
- మరో మహిళకు తీవ్ర గాయాలు



కమలమ్మ



ముజాహిదా

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడు గుపాటుకు వరి పొలంలో కలుపు తీస్తున్న ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. దీంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పొన్నూరు పట్టణానికి చెందిన మహిళా కూలీలు బుధవారం పట్టణ శివారులో ఉన్న బాడవ డొంకలోని వరి పొలాల్లో కలుపు తీయడానికి వెళ్లారు. ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో కూలీలు పంట పొలం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలువ దాటుతున్న వలపర్ల కమలమ్మ (45) అలియాస్ మరియమ్మ, షేక్ ముజాహిదా (50) పిడుగుపాటుకు గురయ్యారు. పక్కనే ఉన్న పంట కాల్వలో విగత జీవులై పడ్డారు. వారి సమీపంలో ఉన్న మరో మహిళ మేశం మాణిక్యమ్మ గాయాలు కావడంతో.. స్పృహ తప్పి పడిపోయింది. ఆమెను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తోటి కూలీలు, మృ తుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలంలో విగత జీవులుగా ఉన్న వారిని చూసి కంటతడి పెట్టుకు న్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరా నాయక్, తహసీల్దారు జియావుల్ హక్ ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూములు ఇవ్వకపోతే.. సేకరణ

- గ్రామదర్శినిలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు
- గ్రామాల్లో రూ.940 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి

అనంతవరం(తుళ్లూరు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధి కొరకు భూసమీకరణ కింద భూములు అందజేయని పక్షంలో భూసేకరణ అమలు చేస్తామని సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. అనంతవరంలో బుధవారం గ్రామదర్శిని జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణంలో రైతులు, భూయజమానులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రాజధాని గ్రామాల్లో రూ.940 కోట్లతో మౌలిక వసతులు అభివృద్ధి చేసేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లలో సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేసి రైతులకు అందజేస్తామన్నారు. జాబ్‌మేళాలు, స్కిల్‌డెవలప్మెంట్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసుకోవాలని రైతులకు తెలిపారు. గ్రామదర్శినిలో రైతులు తెలిపిన ప్రతీ సమస్యను సీఆర్డీఏ పరిష్కరిస్తుందన్నారు. గ్రామకంఠాలు, స్థానికంగా మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై రైతులు, స్థానికులు చెప్పిన పలు సమస్యలను కమిషనర్ నోట్ చేసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్-ల్యాండ్స్ (క్యాపిటల్ సిటీ) వసంతరాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.పద్మా వతి, సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్ రాములు, డీసీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(ఎల్.ఏ) ఎస్.రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.



అనంతవరం గ్రామ దర్శినిలో కమిషనర్‌కు సమస్యలు తెలుపుతున్న రైతులు

పారిశుధ్యం పక్కాగా నిర్వహించాలి

మున్సిపాల్టీల సమీక్షలో కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, మున్సిపల్ సేవలు, మంచినీటి సరఫరాపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నందున ఆయా అంశాలను మరింతగా మెరుగుపర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న నెలరోజుల్లో పట్టణ ప్రాంతాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి వ్యర్థాల సేకరణ, తరలింపు, కాల్వలు శుభ్రపరిచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వ్యర్థాలు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈట్ స్ట్రీట్స్, స్వయం సహాయక సంఘాల స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ ఏసీ చల్లా ఓబులేసు, ఎస్ఈ సుందరరామిరెడ్డి, సీపీ రాంబాబు, డీసీలు వెంకటకృష్ణయ్య, శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరులు కోటేశ్వరారావు, విష్ణుమూర్తి, వేణుగోపాల్, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా, ఏసీ శకుంతల, డీసీ శ్రీకాంత్, తెనాలి, పొన్నూరు మున్సిపల్ కమిషనర్లు రామ అప్పలనాయుడు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస అస్త్రం

- ప్రత్తిపాడు వైసీపీలో ముసలం
- ఆర్డీవోకు లేఖను అందించిన ఎంపీటీసీలు

ప్రత్తిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎంపీపీ దాసరి అన్నమ్మపై వైసీపీకి చెందిన ఎంపీటీసీలు తిరుగుబావుటా ఎగురవేశారు. ఒప్పందం ప్రకారం ఎంపీపీ పీఠం నుంచి దిగిపోవాలని దాసరి అన్నమ్మతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆ పార్టీకి చెందిన ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. దీంతో ప్రత్తిపాడు వైసీపీలో ముసలం తారాస్థాయికి చేరింది. ఎంపీపీ భర్త దాసరి చెంచు రామారావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కూడా ఆ పార్టీ నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి బయటకు రావడానికి కొందరు ఎంపీటీసీలతో పాటు కీలక నాయకులు సైతం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీలు ఉండగా, అందులో పది స్థానాలు వైసీపీ, రెండు టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి వైసీపీ బలపరచిన ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించారు. అయితే అప్పట్లో హోం మంత్రిగా ఉన్న సుచరిత ఆదేశాల మేరకు దాసరి అన్నమ్మ, బూసి సువార్తమ్మలు చెరి రెండున్నర సంవత్సరాలు ఎంపీపీగా కొనసాగేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు గడువు ముగిసినప్పటి నుంచి పదవి నుంచి దిగిపోవాలంటూ అన్నమ్మను బూసి సువార్తమ్మ వర్గం కోరుతున్నా వారు పట్టించుకోలేదు. దీనిపై వైసీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్‌వద్ద పంచాయితీ జరిగినా విషయం తేలకపోవడంతో తగ్గేది లేదు.. తాడో పేడో తేల్చుకునేందుకు సువార్తమ్మవర్గం సిద్ధమైంది. ఈ క్రమంలో బుధవారం గుంటూరు ఆర్డీవోకు ఎంపీపీపై అవిశ్వాసం తీర్మానం లేఖను వైసీపీకి చెందిన ఎంపీటీసీలు అందజేశారు.



ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానంపై లేఖను అందజేస్తున్న ఎంపీటీసీలు

ట్రాఫిక్ ఎక్కడా ఆగకూడదు

గుంటూరులో ఎస్పీ పర్యటన.. ట్రాఫిక్ రద్దీ పరిశీలన


గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎక్కడా వాహనాలు ఆగకుండా ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలో ఆకస్మికంగా పర్యటించి ట్రాఫిక్ రద్దీని పరిశీలించారు. ప్రధాన కూడళ్లలో వాహనాల కదలిక, ట్రాఫిక్ సిబ్బంది విధి నిర్వహణ తీరు, ట్రాఫిక్ నియంత్రణ పరికరాల పనితీరు మొదలైన అంశాలను సమీక్షించారు. పట్టాభిపురం పై ఓవర్, బ్రాడీపేట శంకర్ విలాస్ పరిసరాలు, మూడు వంతెనలు, కొత్తపేట శివాలయం సెంటర్, బస్టాండ్ సెంటర్, మార్కెట్ సెంటర్, ఎంటీబీ సెంటర్ తదితర ప్రాంతాల్లో వాహన రద్దీ పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ పరిస్థితులు, మళ్లింపుల మార్గాలు, సిగ్నల్ వ్యవస్థ పనితీరు, ట్రాఫిక్ సిబ్బంది కేటాయింపులు, వారి సమయపాలన వంటి అంశాలను ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ట్రాఫిక్ మ్యాప్‌లను పరిశీలించారు. ప్రధాన ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలను గుర్తించారు. ట్రాఫిక్ మళ్లింపుల అమలు స్థితి, ట్రాఫిక్ జామ్‌లు తలెత్తే ప్రదేశాలు, ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయ మార్గాల ప్రణాళిక, ట్రాఫిక్ సిగ్నల్స్ సాంకేతిక పనితీరు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ వ్యవస్థ, బ్రీత్‌అనలైజర్ పరికరాల పనితీరు, ర్యాష్ డ్రైవింగ్‌పై తీసుకుంటున్న చర్యలు, రోడ్డు భద్రత, హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహన తదితర అంశాలపై ట్రాఫిక్ పోలీసులతో సమీక్షించారు. శంకర్ విలాస్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ స్థితిని డ్రోన్ ద్వారా ఎస్పీకి వెస్ట్ డీఎస్పీ అరవింద్ ప్రత్యక్షంగా చూపించారు. ఈ ఆధునిక పద్ధతిలో పర్యవేక్షణ ద్వారా వాహనాల కదలిక, ట్రాఫిక్ అడ్డంకి పాయింట్లను ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్లలో సమయానికి విధులు నిర్వహించాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలను, మళ్లింపులను క్రమశిక్షణగా అమలు చేయాలన్నారు. మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుని రోడ్లపై అవాంతరాలు లేకుండా వాహనాలు సజావుగా వెళ్లేలా చూడాలన్నారు. భారీ వాహనాలు నిర్ణీత సమయాల్లో మాత్రమే నగరంలోకి ప్రవేశించేలా కఠినంగా అమలు చేయా లన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ పరికరాలు నిరంతర పరిశీలనలో ఉంచి, సాంకేతిక లోపాలను వెంటనే దిద్దాలన్నారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస రావు, ఎస్బీ సీఐ అళహరి శ్రీనివాస్, సీఐలు ఆరోగ్యరాజు, సింగయ్య, ఎస్ఐలు రవీంద్ర, పెద్దిరాజుపాల్గొన్నారు.



శంకర్ విలాస్ సెంటర్‌లో డ్రోన్ కెమేరా ద్వారా ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



హైస్పీడ్.. సిద్ధం



హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నమూనా



- ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్
- గుంటూరు మీదగా హైదరాబాద్ - చెన్నైకు ప్రాజెక్టు
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్

1 ● తెలంగాణలోని ఖమ్మం మీదగా అమరావతి రాజధాని, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం, చెన్నై ఓఆర్ రోడ్డు మీదగా చెన్నై సెంట్రల్.

2 ● హైదరాబాద్, శంషాబాద్, భారత్ సిటీ, దాచేపల్లి(నడికుడి), నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు, చెన్నై ఓఆర్ రోడ్డు, చెన్నై సెంట్రల్.

బాపట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు నివేదిక సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే(కన్‌స్ట్రక్షన్స్) విభాగం డీపీఆర్‌ని సిద్ధం చేసి రైల్వేబోర్డుకు నివేదించనున్నది. ఈ కారిడార్ మొత్తం పొడవు 760 కిలోమీటర్లు కాగా అందులో 504 కిలోమీటర్లు ఏపీలో ఉండగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా ఎలైన్‌మెంట్ ఉన్నది. ఇప్పుడున్న ఎస్ఎస్ఆర్ రేట్స్ ప్రకారం ప్రాజెక్టు ఖర్చు రూ.3.04 లక్షల కోట్లు అవుతుందని అంచనా. డిజైన్ స్పీడ్ గంటకు 350 కిలో మీటర్లు కాగా ఆపరేషనల్ స్పీడ్ 320 కిలోమీటర్లుగా పొందుపరిచారు. మొత్తం తొమ్మిది రైల్వేస్టేషన్లు రాష్ట్రంలో ఉంటాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం దాదాపుగా 90.315 హెక్టార్ల అటవీ భూ మి అవసరం అవుతుంది. దేశంలో ప్రప్రథమంగా హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కొన్నేళ్ల క్రితం ముంబై - అహ్మదాబాద్ మధ్య నిర్మాణం ప్రారంభించారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం మరో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్‌ని హైదరా బాద్ - చెన్నై (మిగతా 8వ పేజీలో)

'పెమ్మసాని' చొరవతో ఏపీకి రూ.665 కోట్లు

● విడుదల చేసిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఉపాధి హామీ పనుల కింద ఏపీకి రూ.665 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్‌ను కేంద్రప్రభుత్వం బుధవారం మంజూరు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది. ఈ నిధులు రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల మెటీరియల్ ఖర్చులకు ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో భాగంగా అవసరమైన మెటీరియల్ నిమిత్తం ఈ కాంపోనెంటును గ్రామీణాభి వృద్ధిశాఖ కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విడుదల చేశారు. ఏడాదిన్నర కాలంగా ఏపీలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించిన వ్యక్తులకు ఈ మెటీరియల్ కాంపోనెంట్ విడుదల దోహదపడనుంది. ఇందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

అన్నపర్రు ఘటనపై విచారణ

హాస్టల్లో వంట మనిషి, విద్యార్థులను విచారించిన న్యాయాధికారి



విద్యార్థులను విచారిస్తున్న బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు

పెదనందిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై బుధవారం విచారణ జరిగింది. జిల్లా కోర్టు జడ్జి ఆదేశాల మేరకు బాపట్ల 6వ కోర్టు అడిషనల్ జడ్జి శ్యాంబాబు వసతి గృహంలోని విద్యార్థులు, వార్డెన్, వంట మనిషిని విచారించారు. ముందురోజు ఇచ్చిన ఆహారం, తయారీ విధానం, మెనూ, సిబ్బంది పనితీరు ఇలా పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఇంకా సమకూర్చాల్సిన వసతులపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ సీనియర్ అసిస్టెంట్ జడ్జి జి.వాణి, ఎంపీడీవో స్వామిరెడ్డి, పీఎల్‌వీ ఐ.మాణిక్యరావు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలి

● మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత


గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లను వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో పారదర్శకంగా నిర్వహించాలని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. బుధవారం గుంటూరు ఏఎంసీ(మిర్చియార్డు) మీటింగ్ హాల్‌లో పత్తి కొనుగోళ్లపై అనంతపురం, కర్నూలు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ప్రకాశం జిల్లాల మార్కెటింగ్ అధికారులకు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ గత ఏడాదితో పోల్చితే పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్ని మార్పులు చేసిందన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. పత్తి పండించిన రైతులు తొలుత సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వచ్చేలా సమాచారం అందించాలన్నారు. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) అందుబాటులో ఉండి సీఎం యాప్‌లో రైతు ఆధార్, మొబైల్ నంబరుని నమోదు చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. అవి ఆటోమేటిక్‌గా కపాస్ కిసాన్ యాప్‌లోకి వస్తాయన్నారు. కపాస్ కిసాన్ యాప్ అనేది అందరూ వినియోగించుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ జరిగిన తర్వాత తిరిగి సీఎం యాప్‌లో గత ఏడాది వలే ప్రత్తి కొనుగోళ్ల ప్రక్రియని సూపర్‌వైజర్ లాగిన్ ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. చివరగా సంబంధిత ఏఎంసీ సెక్రెటరీ క్రాస్ చెక్ చేసి ఆమోదం తెలపాలి. అప్పుడే తక్‌పట్టి జనరేట్ అవుతుందన్నారు. ఆ తర్వాతనే సీసీఐ అధికారి పరిశీలన చేసి సంబంధిత రైతు బ్యాంకు ఖాతాకు నగదు జమ చేసేలా చూస్తారన్నారు.



ప్రసంగిస్తున్న మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 4,56,107 హెక్టార్లలో పత్తి పంటని సాగు చేశారని, దాదాపుగా 8 లక్షల టన్నుల పత్తి దిగుబడికి అవకాశం ఉందన్నారు. బేల్స్‌లోకి లెక్కిస్తే 15, 23,809 వస్తాయన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ ప్రకారం ఇప్పటి వరకు 4,26,477.25 హెక్టార్ల పంట నమోదైందన్నారు. తేమ శాతం విషయంలో ఒక శాతం మాత్రమే సడలింపు ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసిన రోజునే ప్రత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుందని, లేకుంటే అది రద్దు అవుతుందన్నారు. రైతులు కచ్చితంగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, డీడీ దివాకర్, జీఏఎంసీ సెక్రెటరీ ఏ చంద్రిక, ఏడీ సత్యన్నారాయణ చౌదరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 49,335 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 54,865 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 49,335 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 2,523 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,800, ఎడమ కాలువ ద్వారా 7,937, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,723, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 52,560 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 52,560 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నిరాటంకంగా విద్యుదుత్పత్తి..

రెంటచింతల,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0722 ఎంయూల విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 12702 క్యూసెక్కులు,టేల్ రేస్ చానల్ ద్వారా 8,672 క్యూసెక్కులు మొత్తంగా 21,374 క్యూసెక్కుల నీరు పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల జలపాతం, హాలియా వాగుల నుంచి 32,723 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అనగాని

రేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని, ప్రజలు అనవసర ప్రయాణాలు మానుకోవాలన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షాల కారణంగా చెట్లువిరిగిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజారవాణా కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులంతా సహాయ చర్యల్లో పాల్గొనాలని మంత్రి ఆదేశాలు జారీచేశారు.

కల్తీ మద్యం కట్టడికి సురక్షా యాప్ : చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, అక్టోబరు 22: కల్తీ మద్యం పేరు వినిపిస్తేనే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం అన్న మాటే వినిపించకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు నూతనంగా సురక్షా మొబైల్ యాప్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణదారులపై ఉందన్నారు. అక్రమ మద్యం నివారణకు ఈ నెల 29 వరకు వారం రోజుల పాటు ప్రజా భద్రతా అవగాహన ప్రచారాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. నాయకులు స్థానిక మద్యం దుకాణాలను సందర్శించాలన్నారు.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏప్రిల్‌లో జరిగిన ఫార్మసీ రివాల్యూషన్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నియంత్రణ అధికారి శివప్రసాద్ విడుదల చేశారు. జూలైలో జరిగిన నానోటెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలను కూడా విడుదల చేశారు. వచ్చే నెల 3లోగా రూ.1860 చెల్లించి రివాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

10న పెదకాకాని ఎంపీపీ అవిశ్వాస ఎన్నిక

● పర్యవేక్షించనున్న గుంటూరు ఆర్డీవో

పెదకాకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని ఎంపీపీ తులిమిల్లి శ్రీనివాసరావుపై ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఎన్నికను నవంబరు 10వ తేదీన నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్ అన్సారియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఆర్డీవో కె.శ్రీనివాసరావును విశ్వాస తీర్మాన ఎన్నికలు పర్యవేక్షించాలని ఆదేశించారు. దీంతో వచ్చే నెల 10వ తేదీన ఎంపీపీ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. పెదకాకాని మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలలో 21 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. వారిలో 14 మంది అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే టీడీపీ వైపున మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు చేరిపోయారు. ప్రస్తుతం ఎంపీపీ శ్రీనివాసరావును దించేసి, కొత్తగా టీడీపీ తరఫున ఎంపీపీని ఎన్నుకోవాలని నాయకులు భావిస్తున్నారు. మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్న కొప్పురావూరు ఎంపీటీసీ సభ్యుడు కామినేని శ్రీనివాసరావును ఎన్నుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

తల్లి మీద బెంగతో కొడుకు ఆత్మహత్య

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లి ఇంటికి రావడం లేదనే బెంగతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కంచర్లపాలెంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. కంచర్లపాలెం వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్న పందిపాటి ప్రిన్స్ (19) బుధవారం తన ఇంటిలో ఎవరు లేని సమయం చూసి ఫ్యాన్‌కి లుంగీతో ఉరి వేసుకున్నాడు. అయితే.. తల్లితండ్రుల మధ్య డబ్బులు విషయంలో గొడవలు జరిగాయి. దీంతో తల్లి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎన్నిసార్లు పెద్దలు సంప్రదింపులు జరిపినా తిరిగి రాలేదు. దీంతో తల్లి మీద బెంగ పెంచుకున్న ప్రిన్స్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ఆహ్వానం



వెంకయ్యనాయుడును కలిసిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ దంపతులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5 వరకు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, సురేఖ దంపతులు ఆహ్వానం పలికారు. మహాసభల్లో భాగంగా 5న సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవ్వాలని వెంకయ్యనాయుడుని వారు కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారని డాక్టర్ గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజలకు మేలు చేస్తే జగన్‌కు నచ్చదు

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలు దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నంబరు వన్‌గా నిలిపే విధంగా ఉన్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలు కూటమిపై ఉన్న నమ్మకంతో ఏపీ వైపు వస్తున్నారన్నారు. దీనిని అడ్డుకునేందుకు వైసీపీ కావాల్సినంత విష ప్రచారం చిమ్ముతోందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు మరికొన్ని రాష్ట్రాలు ప్రయత్నించినా ఏపీ వైపే మొగ్గు చూపడం.. కూటమి ప్రభుత్వం కృషి వల్లే సాధ్యమైందని.. ఐటీ రంగం నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయులతో వచ్చే నెలలో గెట్ టు గెదర్ ఏర్పాటు చేస్తామన్నారు. వరంగల్ జిల్లాలోని ఓ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న అధునాతన పద్ధతులు, పంటల సాగు విధానంపై వచ్చే నెలలో వ్యవసాయ అధికారులు, రైతులతో ముఖాముఖి, పంటల సందర్శన చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో కొమ్మినేని రామచంద్రరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ వీరాస్వామి, కనిగిరి శ్రీను, దియ్యా రామకృష్ణ, వడ్డవల్లి సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, బాబావలి, తంగెళ్ల శ్రీను, కోట హరి, యడ్లపల్లి శివ, నారాయణ, నల్లపాటి నెప్రహా, పర్వతనేని రామారావు, వున్నం వెంకట్రావు, చింతలపూడి రామ్మూర్తి, కారు సైదా, మేకల రాంబాబు, అనబోతుల నర్సిరెడ్డి, వల్లెపు రామకృష్ణ, తెలుగుయువత ఖాశిం, నర్రా సాంబశివరావు, మేకల మస్తాన్, మీనిగల అంజిబాబు, లంజేపల్లి కొండలు పాల్గొన్నారు.

నకిలీ డీఎస్పీ అరెస్టు

చిలకలూరిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నకిలీ డీఎస్పీ అవతారం ఎత్తి పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ఒక యువకుడిని చిలకలూరిపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాస్ (35) అనే యువకుడు స్థానిక సుగాలీ కాలనీలో నివాసముంటున్నాడు. పోలీస్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి.. స్థానిక గుండయ్య తోటకు చెందిన ధూపాటి భులక్ష్మి అనే యువతి వద్ద రూ.30 వేలు తీసుకున్నాడు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్దకు ఆమెను తీసుకువెళ్లి పోలీసు యూనిఫాం, బ్యాడ్జి, లాఠీ, టోపీ ఇచ్చాడు. ఉద్యోగం వచ్చిందని భావించి ఇంటికి వచ్చిన బాధితురాలికి అసలు విషయం బోధపడింది. మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు జరుపగా ఆ యువకుడు పలు నేరాలకు పాల్పడినట్టు తెలుసుకున్నారు. మార్కాపురం, రాజమండ్రి, మేడికొండూరు, త్రిపురాంతకం, నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లలో అతడిపై కేసులో ఉన్నట్లుగా గుర్తించారు. చిలకలూరిపేట కేసులో ముద్దాయిగా ఉన్న అతనిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం రిమాండ్‌కు పంపారు. చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య కళాశాలకు.. పూర్వ విద్యార్థుల రూ.కోటి విరాళం

గుంటూరు మెడికల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1980వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కాలేజీలోని వివిధ విభాగాల అభివృద్ధికి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఈ మేరకు వారు ఈ విషయాన్ని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారీకి తెలిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన అమెరికాలో స్థిరపడిన ఎన్నారై డాక్టర్ లీలా తన తల్లిదండ్రుల పేరిట రూ.51 లక్షల విరాళం ప్రకటించారు. డాక్టర్ లీలా అందజేసే విరాళంలో రూ.25 లక్షల వ్యయంతో ఫిజియాలజీ ల్యాబ్‌ను, రూ.26 లక్షలతో మైక్రోబయాలజీ ల్యాబ్‌ను ఆధుకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. మిగిలిన పూర్వ విద్యార్థులు అందజేసే రూ.50 లక్షలతో బయోకెమిస్ట్రీ ల్యాబ్‌ను ఆధుకరిస్తామని ఆయన ప్రకటించారు. తమ మాతృ విద్యాసంస్థ అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చిన 1980వ బ్యాచ్ పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి అభినందించారు.

నిందితుడికి జీవిత ఖైదు.. జరిమానా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు కట్నం కోసం వేధించిన నిందిగుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా పడింది. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన చల్లా అనిల్‌కుమార్‌కు నరసరావుపేట మండలం ఎక్కలవారిపాలెం గ్రామానికి చెందిన మచ్చ గాని వేమలమ్మకు 2015లో వివాహమైంది. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు అనిల్‌కుమార్ తన భార్యను అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ నేపథ్యంలో వేమలమ్మ అతని వేధింపులు భరించలేక 2019లో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలు తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో నేరం రుజువడంతో నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ నరసరావుపేట 13వ అదనపు జిల్లా అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్య శ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసు ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్ బాబు నిర్వహించారు.

ఉత్సాహంగా రెవెన్యూ సర్వీసెస్ క్రీడా పోటీలు



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

గుంటూరు (క్రీడలు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లా రెవెన్యూ సర్వీసెస్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విధి నిర్వహణలో ప్రతినిత్యం సతమతమయ్యే రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ క్రీడాంశాలలో ఉద్యోగులు ఒకరితో ఒకరు తలపడ్డారు. ఈ పోటీలలో ప్రతిభను చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనునట్లు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వహణకు సహకరించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మంచి సాహిత్యంతోనే

మానవ సంబంధాలు మెరుగు

● ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి ఓల్గా ● ఎస్ఆర్ఎంలో సాహిత్య ఉత్సవం ప్రారంభం

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన సాహిత్యంతో మానవ సంబంధాలు మెరుగుపడతాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత్రి పి.లలిత కుమారి (ఓల్గా) అన్నారు. మంచి సాహిత్యంతో ఆరోగ్యకరమైన సమాజం కళ్ల ముందుకు వస్తుందని ఆమె పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం అమరావతి సాహిత్య ఉత్సవం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో పాశ్చాత్య పోకడలు పెరిగి నైతిక విలువలు పతనమవుతున్నాయని అన్నారు. అంతటా హింస ప్రవృత్తి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, మెడికల్, న్యాయ కళాశాలల్లో మానవ విలువలను పెంపొందించే ప్రత్యేక పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని సూచించారు. తన సోదరి ఓల్గా మరణానంతరం ఆమె పేరును తన కలం పేరుగా మార్చు కొని రచనలు చేస్తున్నానని తెలిపారు. యువత పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సుల కోసం పరుగులు తీయొద్దని,



జ్యోతి ప్రజ్వలన చేసి సాహిత్య ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న రచయిత్రి లలిత కుమారి (ఓల్గా)

మంచి సాహిత్యం ఉన్న పుస్తకాలను పఠనం చేస్తే సరిపోతుందని ఓల్గా పేర్కొన్నారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య సతీష్‌కుమార్ మాట్లాడుతూ, కవులు, విమర్శకులు, సాహిత్యాభిలాషలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి ఆలోచనల నుంచి వచ్చే నూతన సృజనలకు ప్రాణం పోయాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆమ్లాన్ బైశ్య మూడు రోజుల కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమానికి హాజరైన సాహిత్యవేత్తలను పరిచయం చేశారు. అనంతరం ముఖ్య అతిథి ఓల్గాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్ కుమార్, లిబరల్ ఆర్ట్స్ స్కూల్ డీన్ డాక్టర్ బిష్ణు పథ్, విభాగాధిపతి డాక్టర్ శయంటిన్ ఠాగూర్ ప్రసంగించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

29,896 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 31,782 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 29,896 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,464 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	14800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	---	---	నెంబరు. 5	10000	14800
341	10000	15500	273	10000	13500
4884	---	---	341	10000	15800
సూపర్ 10	---	---	సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	8000

రాత్రిపూట రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళల్లో అకారణంగా రోడ్లపై తిరిగితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, రాత్రి సమయాల్లో అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై కేసులు నమోదు చేయాల్సిందిగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు పోలీసులు 637 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. "ప్రజల భద్రత - పోలీసుల బాధ్యత" అనే ప్రధాన ఉద్దేశంతో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సినిమా హాళ్లు, మందుల షాపులు, ఆసుపత్రుల వద్ద నుంచి రాత్రి సమయాల్లో వచ్చేవారు, ప్రయాణాలు చేసే వారు పోలీస్ వారి తనిఖీల సమయాల్లో తప్పనిసరిగా తమ వద్ద ఉన్న సంబంధిత పత్రాలను చూపించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు జీఎంసీలో అత్యవసర సమావేశం

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన సాయంత్రం నాలుగు గంటలకు అత్యవ సర సమావేశం నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ కార్యదర్శి బి.శ్రీనివాసరావు బుధవారం పేర్కొన్నా రు. ఎనిమిది అంశాలతో కూడిన ఏజెండాను సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

మత్తు పదార్థాలు దేశ భవితకు పెను ముప్పు : గొళ్ళమూడి

గుంటూరు (విద్య), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో యువత భవిష్యత్తుతో పాటు దేశ భవితకు పెను ముప్పు వాటిల్లుతోందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గొళ్ళమూడి శేఖర్‌బాబు అన్నారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో వసంతరాయపురంలోని లూర్దుస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ, ఆల్కాహాల్, పొగాకు, గంజాయి వంటి వాటి వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా యువత వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ కవిత మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-అడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులో "బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు బానిస నుంచి విముక్తి పొందాలనుకునే వారు ఈ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని చెప్పారు. నవజీవన్ బాలభవన్ కో- ఆర్డినేటర్ బి.రమేశ్, పాఠశాల ఉపా ధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఆకాశదీపం ఆరోహణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర్వస్వామి దేవాలయ ప్రాంగణంలో కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి బృందం మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆకాశదీపం ఆరోహణ గావించారు. భక్తులు పూజలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పద్మావతి కల్యాణవేదికపై శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి మహాభారతంలోని అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువులోని కోదండ రామాలయంలో కార్తీక మాసం ప్రారంభోత్సవం సందర్భంగా స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ బృందం, పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రామకృష్ణ శర్మ, డోలక్‌పై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

పెయింటర్ మృతి

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెయింట్ వేస్తూ బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి జారి పడిన పెయింటర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పత్తిపాడు మండలం రాయపాటివారిపాలెం గ్రామానికి చెందిన ముత్తనపల్లి విక్టర్‌బాబు (46) పెయింట్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 17న బ్రాడీపేట 6/12వ లైన్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి విక్టర్‌బాబు మొదటి అంతస్తులో పెయింటింగ్ పని చేస్తూ ఉండగా అదే సమయంలో మార్బుల్ మిషన్ కోసం ఉపయోగించే కరెంటు వైర్ జాయింట్ సరిగా వేయకపోవడంతో కరెంటు షాక్ తగిలి కింద పడిపోయాడు. అప్పటి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మద్యానికి ఈ బానిసైన ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు స్టేషన్ పరిధి లోని ఓబుల నాయుడు పాలెం గ్రామానికి చెందిన మాసప్పగారి హరికృష్ణ (21) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. నిత్యం మద్యం తాగి వచ్చి డబ్బుల కోసం భార్యతో గొడవ పడుతుండేవాడు. బుధవారం కూడా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇంటిలోని దూలాలానికి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో జోరు వాన

- ఉదయం నుంచే మేఘావృతమైన ఆకాశం
- మధ్యాహ్నం నుంచి జోరు వర్షం
- తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు

గుంటూరు (కార్పొరేషన్), గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో అల్పపీడనం ప్రభావంతో నగరంలో మధ్యాహ్నం నుంచి వర్షం ముసురు పట్టినట్లయింది. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురు స్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఇందులో భాగంగా ఉద యం నుంచే ఆకాశం మేఘావృతమైంది. మధ్యాహ్నం నుంచి జోరు వర్షం మొదలైంది.

గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులు, డ్రెయిన్లు, కాలువలు వర్షపు నీటితో పొంగిపొర్లాయి. ప్రధానంగా బ్రాడీపేట, బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం, అరండల్‌పేట, స్తంభాలగరువు, పాత గుంటూరులోని అనేక ప్రాంతాలు, నందివెలుగు రోడ్డులోని శివారు ప్రాంతాలు, నగరంలోని అనేక ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంకర గుంట ఫ్లైఓవర్ కింద, 3 వంతెనల వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిం చింది. దీంతో ఆ మార్గాల గుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు.



వర్షానికి రక్షణగా ...

చిరు వ్యాపారులు విలవిల

నగరంలో ముసురు పట్టటంతో సాయంత్రం సమయంలోనూ బయటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దాంతో నగరంలో బ్రాడీపేట, అరండల్‌పేట, బృందాన్‌గార్డెన్స్, లాలాపేట, మార్కెట్ సెంటర్, గుజ్జనగుండ్ల, కొరిటపాడు, బస్టాండ్ సెంటర్‌లలో వ్యాపారాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి. మరో వైపు రోడ్డు పక్కన తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బ్రాడీపేట 1/15 వ లైనులో వర్షపునీరు



పట్టాభిపురం మెయిన్ రోడ్డులో వర్షపునీరు

ఆక్రమణలోని ప్రభుత్వ భూములను గుర్తించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తక్ష ణమే గుర్తించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారులతో ఆమె బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే నంబర్ల వారీగా ఆక్రమణలు గుర్తించి, వాటి జాబితా రూపొందించాలన్నారు. రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది బృందాలు గా ఏర్పడి క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. కోర్టు కేసులు ఉన్న స్థలాలపై ప్రత్యే క చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో సమర్పించిన అర్జీలపై స్పష్టమైన విచారణ చేపట్టాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై జిల్లా ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకూడదని స్పష్టం చేశారు. ప్రజలను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు, సర్వేయర్లు గ్రామసభలు సక్రమంగా చేపట్టే విధంగా పర్యవేక్షణ జరగాలని దిశానిర్దేశం చేశారు. జా యింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్కే ఖాజావలి, డివిజనల్ అధికారి శ్రీని వాసరావు, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, విజయలక్ష్మి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారులతో సమావేశమైన కలెక్టర్ అన్సారియా

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ కంపెనీ కంపైల్‌ఇట్ నిర్వ హించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్ జేసీ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళా శాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. 14 మంది ఎంబీఏ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్ హోదాలో రూ.5 నుంచి 6 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ, ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15వేలు స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలి పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, కే సురేష్‌బాబు, ఎంబీఏ విభాగాధిపతి టి.శ్రీకృష్ణ, కళాశాల మేనేజ్మెంట్ సైన్సెస్ విభాగ డీన్ సీహెచ్ బాల నాగేశ్వరరావు, ఎంబీఏ విభాగ ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి ఎన్.వినోద్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

బీఆర్ గవాయిపై దాడిని ముక్తకంఠంతో ఖండించాలి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడిని దేశ ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించాలని దళిత, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధ వారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ అధ్యక్షతన గవాయిపై దాడిని ఖండిస్తూ ప్రజా, దళిత సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు మాట్లాడుతూ, సీజేపై దాడి అంటే భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్య విలువలపై దాడేనని అభివర్ణించారు. దీన్ని రాజద్రోహంగా పరిగణించి దాడి చేసిన వ్యక్తిని దేశ బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ, దాడి చేసిన అడ్వకేట్ రాకేశ్ కిషోర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అన్నారు. కఠిన శిక్షలతోనే ఇటువంటి ఘటనలు పునరావృతం కావని అభిప్రాయపడ్డారు. గవాయిపై దాడిని నిరసిస్తూ డిసెంబరు 10న చేపట్టబోయే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్సీ కమీషన్ సభ్యుడు కట్టిపోగు బసవయ్య, పానుగంటి షాలెం రాజు మాదిగ, ఈమని చంద్రశేఖర్, నల్లపు విజయరాజు, చంద్ర నాయక్, దేవరకొండ రోశయ్య, నాగరాజు, ఖాజావలి పాల్గొన్నారు.



నిరసన చాటుతున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

శ్రీశైలం దేవస్థాన అభివృద్ధికి నిరంతర కృషి

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా నిరంతరం కృషి చేస్తానని శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు బోడెపూడి వెంకట సుబ్బారావు స్పష్టం చేశారు. దేవస్థానం బోర్డు సభ్యునిగా ఇటీవల నియమితులైన బోడెపూడిని బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రిటైర్డ్ ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా బోడెపూడి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉన్న శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉంటానన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బోల్లేపల్లి సత్యనారాయణ, విద్యావేత్త గడిపూడి వెంకట రాయుడు, రిటైర్డ్ ఐజీ రవిచంద్ర, రిటైర్డ్ డీఎస్పీలు సుబ్బారెడ్డి, నారాయణ, పోతురాజు, కందిమళ్ళ వెంకట్రావు, బిల్డర్ నన్నపనేని సుబ్బయ్య, టీడీపీ నేత చిగురుపాటి నాని పాల్గొన్నారు.



బోడెపూడిని సన్మానిస్తున్న విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం నేతలు

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- సదస్సులో ఐటీ కోర్ సీఐ నిసార్‌బాషా



సదస్సులో మాట్లాడుతున్న ఐటీ కోర్ సీఐ నిసార్‌బాషా

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే నిత్యం అప్రమత్తతతో ఉండాలని ఐటీ కోర్ సీఐ నిసార్‌బాషా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసీ కళాశాలలో బుధవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై విద్యార్థులు, ఉపాధ్యాయు లకు అవగాహన కల్పించారు. దేశవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పును తగ్గించడం, ప్రజల్లో సైబర్ భద్రతపై చైతన్యం పెంపొందించడం కోసం కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెం టర్ పలు అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా అక్టోబర్ నెల ను జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని సీఐ తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయండి లేదా డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూడాట్ సైబర్ క్రైమ్ డాట్ జీవోవి డాట్ ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, ఎస్ఐ రమేష్, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ రాజకిషోర్, ఇతర పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపే విజయాలు సాధించాలి

- కేజేఎస్ఎస్ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి



హిమబిందు, నెలకుదిటి అనూషాను సత్కరిస్తున్న కమ్మజన సేవాసమితి సభ్యులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మనం సాధించిన విజయాలు ఇతరు ల్లోనూ స్ఫూర్తి నింపేలా ఉండాలని కమ్మజన సేవాసమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్ర నాథ్ చౌదరి అన్నారు. స్థానిక కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి ఉపాధ్యక్షుడు మాదల రత్నగిరిబాబు అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ టెన్నిస్ క్రీడాకారిణి నెలకు దిటి అనూషకు రూ.2లక్షలు, మాదల శంకుతల, భాస్కర్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈదర హిమబిందుకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించిన హరేంద్ర నాథ్ చౌదరి మాట్లాడుతూ సేవా భావంతో మాదల రత్నగిరిబాబు అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎస్ఆర్టీఎస్ డైరెక్టర్ కానూరి శేషుబాబు మాట్లాడుతూ ఏపీసెట్‌లో 16వ ర్యాంకు వచ్చినా, నర్సింగ్ వృత్తి ఎంచుకున్న డాక్టర్ ఈదర హిమబిందు సేవా దృక్ప థాన్ని అభినందిస్తున్నట్టు తెలిపారు. సాఫ్ట్‌బాల్ టెన్నిస్ క్రీడలో అనూషా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. సమితి కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, మాదల రత్నగిరి బాబు, హిమబిందు, అనూష ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కావూరి రవిచంద్ర, వడ్లమూడి శివరామకృష్ణయ్య, మర్రిపూడి సీతారామయ్య, పట్టాభి సీతారామయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తాం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్
- బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు రోడ్డు నిర్మాణం

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బుధవారం తూర్పు నియోజకవర్గంలోని గుంటూరు కార్పొరేషన్ విలీన గ్రామమైన బొంతపాడు నుంచి ఏటుకూరు వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 99లక్షలతో నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గుంటూరు కార్పొరేషన్‌గా అవతరించాక చుట్టుపక్కల కొన్ని గ్రా మాలు విలీనమయ్యాయని చెప్పారు. అయితే ఆయా గ్రామాలకు నగరంలో కనెక్టివిటీ కోసం మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి అధికారంలోకి వచ్చాక విలీన గ్రామాలకు రోడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులపై దృష్టి సారించామని తెలిపారు. ఇందులో భాగంగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, తాగునీటి సరఫరా కూడా చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, డివిజన్ అధ్యక్షులు బ్రహ్మసాని శ్రీనివాస్, ఏడుకొండలు, అబ్బాస్ అలీ, శ్రీకాంత్, గోపి, రహమతున్నిసా, సరోజ, హరికృష్ణ, శ్రీను, రాంబాబు, వెంకయ్య పాల్గొన్నారు.



ఎస్ఆర్ శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఎస్ఆర్ శంకరన్ సేవలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారిగా ఎస్ఆర్ శంకరన్ ఈ రాష్ట్రానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నా రు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరన్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలాం కరణ చేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ శంకరన్ ప్రజలతో కలిసిమెలసి పని చేసిన అధికారిగా ఆయన మన్ననలు పొందారన్నారు. శంకరన్ ఎస్సీలు, గిరిజనులు, అట్ట డుగు వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేశారని, సామాజిక న్యాయం కోసం కృషి చేసారని కొనియాడారు. బానిసత్వ నిర్మూలన చట్టం అమల్లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. పదవీ విరమణ తర్వాత కూడా ప్రజాసేవలోనే కొనసాగిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన వ్యక్తిత్వం,సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శ, స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్ కే ఖాజావలి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న మహ్మద్ అహ్మద్ షరీఫ్, నసీర్ తదితరులు

బ్రైట్ హారిజాన్స్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

- ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్

గుంటూరు (తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవతో పాటు యువతకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్న బ్రైట్ హారిజాన్స్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు మహ్మద్ అహ్మద్ షరీఫ్ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని అబ్దుల్ కలాం అజాద్ షాదీ ఖానాలో బ్రైట్ హారిజాన్స్ ఫౌండేషన్, షార్ప్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాను తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి అహ్మద్ షరీఫ్ ప్రారంభించారు. అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ, యువతకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, రాజధాని పరిధిలో మరిన్ని జాబ్‌మేళాలను నిర్వహించాలని కోరారు. నిర్వాహకులు ఎమ్‌కేఎస్ మొహినుద్దీన్, షేక్ బాజీ మాట్లాడుతూ, జాబ్ మేళాలో 40 కంపెనీలు పాల్గొనగా.. దాదాపు 1800 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, వారిలో 640 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం అతిథుల చేతుల మీదగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, సలీమ్‌బాషా, హసన్, అంసార్‌బాబు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

దాడులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

- కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము డిమాండ్



వివిధ జిల్లాల కాపు నేతలతో జేఏసీ కన్వీనర్ దాసరి రాము

గుంటూరు మెడికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కాపులపై జరుగుతున్న దాడ ులపట్ల కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కాపు జేఏసీ కన్వీనర్ దాసరి రాము డిమాండ్ చేశారు. ఇటీవల దివంగతురాలైన దాసరి రాము కుమార్తె శేష సాయి ప్రియాంక చిత్రపటానికి కాపు నాయకులు ఆమంచి సోములు, చిన్ని మిల్లి వెంకట రాయుడు, జెట్టి గురునాథం, చలమలశెట్టి రమేశ్, బి.ధర్మారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇటీవల పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రావిపాడులో జరిగిన దాడిలో గాయపడి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నదమ్ములను పరామర్శించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిందితుల పట్ల కఠినంగా వ్యవహరించి బాధితులకు సత్వర న్యాయం కలిగేలా చూడాలని కోరారు. ఇటీవల జరిగిన పరిణామాలపై చర్చించేందుకు ఈ నెల 24న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నాడు వైభోగం నేడు విషాదం!





- బాధల్లో 'బంగారు' బతుకులు!
- రెడీమేడ్, మాల్స్ రాకతో పనులపై ప్రభావం
- ధర కొండెక్కడంతో పరిస్థితి తలకిందులు
- రోడ్డుపాలవుతున్న స్వర్ణకారుల కుటుంబాలు
- స్విగ్గీ, డెలవరీబాయ్‌లుగా వెళుతున్న దుస్థితి
- 15,000 కుటుంబాలపై తీవ్ర ప్రభావం

మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన ఒక స్వర్ణకారుడు ముప్పై ఏళ్లుగా స్వర్ణకార వృత్తిలో ఉన్నాడు. చేతినిండా పని ఉండడంతో జేబునిండా సంపాదించాడు. కానీ ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. గడిచిన రెండేళ్లుగా బంగారం ధర పెరగడంతో పనులు తగ్గిపోయాయి. పనులు వస్తాయిలే అన్న నమ్మకంతో అప్పులు చేసేశాడు. తీరా అవి తీర్చడానికి రూ. 70 లక్షల విలువ చేసే ఇంటిని అమ్మేసుకుని రోడ్డున పడ్డాడు. మంగళగిరి పట్టణానికి చెందిన మరో యువకుడు ఆరేళ్ల క్రితం స్వర్ణకార వృత్తిలోకి వచ్చాడు. కొంతకాలం ఫర్వాలేదనిపించింది. గత రెండేళ్లుగా పని లేకుండా పోయింది. ఆరు నెలలపాటు పని రాలేదు. దీంతో స్విగ్గీ బాయ్‌గా వెళుతున్నాడు. ఇది సగటు స్వర్ణకారుల పరిస్థితి. రెండేళ్లుగా పనులు లేకపోవడంతో సమస్తం కోల్పోయి అత్యంత దుర్భర జీవితాన్ని గడుపుతున్న దుస్థితి.



గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు స్వర్ణకారుడంటే ఎంతో గొప్ప పేరుండేది. నిన్న మొన్నటి వరకూ కూడా ఆ గొప్పదనం అలాగే కొనసాగింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పోటీపడేలా అత్యంత విలాసవంతమైన జీవితాలు వారివి.

అప్పట్లో వారి నెలసరి ఆదాయం ఐదంకెల సంఖ్యనుదాటి ఆరెంకెల వరకూ ఉండేది. బంగారపు పనిలో నైపుణ్యం వస్తే చాలు కోట్లు సంపాదించవచ్చు అన్నంతగా ఆ ఒరవడి కొనసాగింది. ఫలితంగా మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ప్రతి చేనేత కుటుంబం నుంచి స్వర్ణ కళాకారులు తయారయ్యారు. విజయవాడ, మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాలు కేంద్రంగా ఈ స్వర్ణకార సమూహం రాష్ట్రంలోనే కాదు.. దేశంలోని అన్ని మార్కెట్లను సొంతం చేసుకుంది. అంతటి వైభోగాన్ని అనుభవించిన స్వర్ణకారులు నేడు కడు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

● రెడీమేడ్స్‌తో ప్రభావం

గుంటూరు జిల్లాలో సుమారు 15 వేల కుటుంబాలు స్వర్ణకార వృత్తిపై ఆ ధారపడి ఉన్నాయి. నాలుగు దశాబ్దా లుగా సానుకూల పరిస్థితి ఉండడంతో మంగళగిరి, తెనాలి, చీరాల పరిసర ప్రాంతాల చేనేత కార్మికుల కుటుంబాలన్నీ స్వర్ణకార వృత్తివైపు మొగ్గు చూపాయి. పదేళ్ల క్రితం వరకూ పరిస్థితి బాగానే ఉంది. తొలినాళ్లలో స్వర్ణకారుల స్వర్ణయుగం నడిచింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో సమానంగా ఆదాయాన్ని గడించారు. సొంత ఇళ్లకూడా నేతకారుల కుటుంబాలు భారీ ఇళ్లను కూడా కట్టుకున్నారు. అత్యంత విలాసవంతమైన జీవితం గడిపారు. దాదాపు 20ఏళ్ల క్రితం బెంగాల్ నుంచి స్వర్ణకారుల వలసలు మొదలయ్యాయి. దీంతో స్థానిక స్వర్ణకారుల పనులపై ప్రభావం పడింది. మెల్లగా పనులు తగ్గడం మొదలయింది. దీనికితోడు ఇటీవల కాలంలో రెడీమేడ్ స్వర్ణాభరణాల తయారీ విపరీతంగా పెరిగింది. భారీ షాపింగ్ మాల్స్ కూడా ఈ రంగంలోకి ప్రవేశించాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, రాయితీలతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో వారంతా పనులు చేయించుకోవడం మానేశారు. ఫలితంగా గత దశాబ్దకాలంగా పనులు లేక స్వర్ణకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ పనులు ఉన్నా తరుగు రూపంలో తీసుకునే ఆదాయం భారీగా పడిపోయింది. గతంలో 5శాతం తరుగుకింద తీసుకుంటుండగా, ఇప్పుడు 3 శాతం కూడా రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి ఆదాయానికి భారీ గండి పడింది.

మూలిగే నక్కపై తాటిపండులా ధరల పెరుగుదల

రెండేళ్లుగా బంగారం ధర కనీవినీ ఎరుగనీ రీతిలో పెరుగుతోంది. రెండేళ్ల క్రితం గ్రాము బంగారం ధర రూ.5వేలు ఉండగా అది ఇప్పుడు రూ.13వేలకు చే రింది. అంటే దాదాపు 160 శాతం ధర పెరిగింది. దీంతో సామాన్యులెవరూ బంగారం వైపు చూడడం లేదు. ధరల్లో అస్థిరత కారణంగా రేటు తగ్గుతుందేమో వేచి చూద్దాం అనే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్వర్ణకారులకు పని తగ్గింది. పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు కూడా స్వర్ణాభరణాల వైపు మొగ్గు చూపడంలేదు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో అవసరమైనా రెడీమేడ్ వైపు వెళుతున్నారు. అందువల్ల స్వర్ణకారులకు పనులే లేని పరిస్థితి నెలకొంది. దీంతో యువకులుగా ఉన్న స్వర్ణకారులు స్విగ్గీ, జొమేటో డెలివరీ బాయ్‌లుగా, ఫ్లిప్‌కార్టు, అమెజాన్, రేపిడో వంటి పనులకు వెళుతున్నారు. మరికొందరు నిర్మాణ కూలీలుగా మారుతున్నారు. అధిక ఆదాయాల వల్ల గతంలో విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడినవారు చాలా మంది ఆ ఆదాయం కోసం బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తెనాలికి చెందిన ఓ యువకుడు ఆరేళ్లు కష్టపడి స్వర్ణకార పనినేర్చుకున్నాడు. కానీ చేసేందుకు పనిలేకపోవడంతో క్రరీస్ పాయింట్ పెట్టుకున్నాడు. అదీ సరిగ్గా నడవలేదు. దీంతో బెట్టింగ్ బాట పట్టాడు. ప్రస్తుతం రూ. పది లక్షల అప్పుల్లో కూరుకుపోయాడు. ఆర్థికంగా స్థిరపడిపోయాం అనుకునేవారు కూడా వారికున్న ఇళ్లను, స్థలాలను అమ్ముకొని వీధిన పడే పరిస్థితి నెలకొంది. స్వర్ణకారుల స్థితిగతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది.



పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఆదర్శం

ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, అందుకు చంద్రబాబుపై ఉన్న నమ్మకం, విశ్వసనీయత, నిబద్ధతలే కారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సొలసలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి రూ.40లక్షలతో నిర్మించిన కల్వర్టు, పాఠశాల ప్రహరీ, సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 వాలీబాల్ పోటీలు, జిల్లా జట్ల ఎంపికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి కోసం ఉద్యోగాలు ఎదురు చూసేలా సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నారన్నారు. పేద, రైతు కుటుంబాల నుంచి వచ్చిన ప్రతి విద్యార్థికి ఉన్నత భవిష్యత్తు అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. విద్యార్థులు, యువత గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. జీవితంలో రాణించాలంటే విద్యార్థులు పరిణతితో ఆలోచించాలన్నారు. పెట్టుబడుల ఆకర్షించి పరిశ్రమలు పెట్టేలా ప్రోత్సహిస్తోంది రాష్ట్రంలోని యువత ఉపాధి, ఉద్యోగావకాశాల కోసమేనన్నారు. ఈ సందర్భంగా 2024-25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తొలి మూడు స్థానాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు రంగనాయక చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4వేలు నగదు బహుమతులను అతిథులు ప్రదానం చేశారు. టీడీపీ నాయకులు వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సాయిబాబు, రఘురామారావు, రత్తయ్య, సుబ్బారావు, మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

అమరేశ్వరాలయంలో కార్తీక మాస పూజలు

అమరావతి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) పంచారామ పుణ్య క్షేత్రాల్లో ప్రసిద్ధమైన బాల చాముం డికా సమేత అమరేశ్వరాలయంలో కార్తీక మాస సందడి ప్రారంభమైంది. బుధవారం భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానమాచరించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిం చారు. స్వామివార్లను దర్శించిన భక్తులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఉసిరి చెట్టు కింద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అట్టహాసంగా శ్రీభ్రమర వార్షికోత్సవం

● సరికొత్త ఆలోచనతో పనిచేస్తామన్న సీఎండీ గల్లా రామచంద్రరావు

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న శ్రీ భ్రమర గ్రూప్ సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాలు గుంటూరులోని ఏఎస్ కన్వెన్షన్‌లో బుధవారం అట్టహాసంగా జరిగాయి. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015 అక్టోబరు 22న స్థాపించిన శ్రీభ్రమర 10 ఏళ్ళ విశ్వసనీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని ట్రస్ట్ ఎడికేడ్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆలోచనలతో ప్రేరణ పొంది, గ్రామాల్లోనూ నగర సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో శ్రీ భ్రమర సంస్థ స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 36కి పైగా అత్యద్భుమైన రియల్ ఎస్టేట్ ప్రాజక్టులు విజయవంతంగా పూర్తి చేసి, 12వేలకు పైగా కుటుంబాల సొంతంటి కలను సాకారం చేసిందన్నారు. ఈ సుస్థిర ప్రస్థానం శ్రీ భ్రమర గ్రూప్‌ను ఏపీ రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయ బ్రాండ్‌గా నిలబెట్టిందని తెలిపారు. వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంలో కేవలం సంవత్సరాలనే కాదు ప్రతి కస్టమర్ నమ్మకాన్ని, ప్రతి ఉద్యోగి కష్టాన్ని, ప్రతి మార్కెటింగ్‌మిత్రుడి అంకిత భావాన్ని గుర్తుచేసుకుంటున్నామన్నారు. ఈ దశాబ్ద ప్రయాణం గొప్ప అనుభవం, గర్వకారణం, ముందున్న రోజుల్లో మరింత ఆలోచనలు, నాణ్యత, విశ్వసనీయతతో ప్రజల నమ్మకానికి తగ్గట్టు పనిచేస్తామన్నారు. వార్షికోత్సవ వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, సీఎండీ గల్లా రామచంద్రరావు ప్రారంభించగా, కార్యక్రమంలో సంస్థ డైరక్టర్‌లు మారం చంద్రశేఖర్, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కల్వకుంట సాయిశంకర్, చెన్నంశెట్టి సతీష్ తదితరులున్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి, శ్రీ భ్రమర సీఎండీ రామచంద్రరావు



ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్

(5వ పేజీ తరువాయి)

సాధన కోసం నిర్వాహకులు ఉద్యమిస్తు న్నారు. ప్రభుత్వం బకాయి విషయంలో స్పందిచకపోవడంతో ఆందోళనను ఉధృతం చేశా రు. ఇప్పటికే జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిం చారు. తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు.. చలో విజయవాడకు పిలుపు నిచ్చారు. గురువారం విజయవాడ వేదికగా నెట్ వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా నిర్వహించనున్నారు.

పేరుకుపోయిన బకాయి..

బకాయిలు పేరుకుపోవడంతో.. నెలవారి ఖర్చులు రాక వైద్య సిబ్బందిని కుదించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆసుపత్రుల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రభుత్వ వ్యవహారంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది భవిష్యత్తు, ఉపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తుండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత వైద్యం తాలూక రూ.2,750 కోట్ల బకాయి చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల యూనియన్ నేత డాక్టర్ నాగోతు ప్రకాష్ తెలిపారు. ఉచిన వైద్య సేవల ప్యాకేజ్‌ను 2009లో కొంత మేర పెంచారు. ఆ తదుపరి ఇప్పటి వరకు వైద్య ప్యాకేజ్ పెంచలేదు. కొత్తగా ప్రతి పౌరుడిగా వైద్య బీమా పథకం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల డాక్టర్ల కొందరిని పథకం అమలులో భాగస్వాములను చేయాలని, ప్యాకేజ్‌లను పెంచే విషయంలో వైద్యలతో చర్చలు జరపాలని కోరారు. బకాయి విడుదల చేసే వరకు బందు కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉచిత వైద్యం బిల్లులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ ప్రకాష్ కోరారు.

హైస్పీడ్.. సిద్ధం

(5వ పేజీ తరువాయి)

మధ్య నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ఎలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. అయితే ఈ రెండింటిలో దాచేపల్లి మీదగానే అనువుగా ఉంటుందని ప్రతిపాదించింది. ఆప్షన్-1గా హైదరాబాద్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ వే అండ్ తిరుపతి ఎయిర్‌పోర్టు కాగా ఆప్షన్-2ని ఎన్‌హెచ్-65 వెంట గ్రీన్ ఫీల్డ్ ఏరియాలో నుంచి ప్రతిపాదన చేసింది. ఎలైన్‌మెంట్ ఖరారు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కోరింది. స్టేషన్లు నిర్మించాల్సిన ప్రదేశాల వద్ద 50 ఎకరాల చొప్పున భూమి అవసరం అవుతుంది. 30 నుంచి 40 ఏళ్ల అవుట్‌లుక్‌తో రాష్ట్ర దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల బ్లూప్రింట్‌లో దీనిని చేర్చాలి. నిర్ణీత గడువు తేదీ లోపు ఫైనల్ లోకేషన్ సర్వే చేయనున్నందున ఎలాంటి జాప్యం లేకుండా సహకారం అందించాలని కోరింది.

మూడు జిల్లాల్లో భూసేకరణ..

- పల్నాడు జిల్లాలో 81 కిలోమీటర్ల పొడవునా ఈ హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరగనున్నది. 7.130 కిలోమీటర్లు అటవీ భూమి కూడా ఉన్నది. దీంతో మొత్తంగా 243 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.
- గుంటూరు జిల్లాలో 66.45 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం జరగనున్నది. ప్రాజెక్టు కోసం 199.35 హెక్టార్ల ప్రభుత్వ/ప్రైవేటు భూమి అవసరం ఏర్పడుతుంది.
- బాపట్ల జిల్లాలో 43.21 కిలోమటర్ల పొడవునా రైలు మార్గం నిర్మాణం జరగనున్నది. 129.63 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది.

మారిపోనున్న ముఖచిత్రాలు

హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ముఖచిత్రాలే మారిపోతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వేల మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రాజెక్టు బాటలు వేయనున్నది. అటు చెన్నై, ఇటు హైదరాబాద్ మధ్య అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది. హెచ్ఎస్ఆర్ స్టేషన్ల వద్ద 50 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నందున అక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి.

ముసురు.. ముంపు

(5వ పేజీ తరువాయి)

రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వర్షం ప్రభావం ఎక్కువగానే చూపింది. పల్నాడు జిల్లాలోనూ వర్ష ప్రభావంతో వాణిజ్య పంటలకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో నాలుగు రోజులు..

మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురు, శుక్రవారాల్లో అల్పపీడనం వాయుగుండంగా మారితే గాలుల తీవ్రత పెరుగుతుందన్నారు. 30నుంచి 70 సెంటీమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

జిల్లాలో మూడురోజులు భారీవర్షాలు

బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో 08643 -220226 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన తక్షణమే సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి బిలియర్డ్స్ టోర్నీ

గుంటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో గురువారం నుంచి ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్ ర్యాంకింగ్ పురుషుల టోర్నమెంట్ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వస్తున్న క్రీడాకారులతో ఎల్వీఆర్ క్లబ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పోటీల నిర్వహణతో క్లబ్బు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వర రావు (అజార్) అన్నారు. బిలియర్డ్స్‌కు 38 ఎంట్రీలు, స్నూకర్స్‌కు 215 ఎంట్రీలు నమోదయ్యాయని తెలిపారు. క్లబ్బుకు చెందిన ఎస్.శంకర్రావు, ఎం.శ్రీనివాసరావు పోటీల్లో తలపడుతున్నారని చెప్పారు. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా క్లబ్బు కార్యదర్శి యాగంటి దుర్గారావు, అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఏల్చూరి వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఏపీ బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ సంఘం ప్రతినిధులు పోటీలకు సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోటీల విజేతలకు 1.35 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామని వెల్లడించారు. ఈ పోటీలను గురువారం ఉదయం 9 గంటలకు శాప్ ఛైర్మన్ ఎ.రవి నాయుడు ప్రారంభిస్తారని అజార్ తెలిపారు.



బిలియర్డ్స్ టేబుల్‌పై సాధన చేస్తున్న క్రీడాకారుడు



మూడు జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో జ్యోతి బసు

స్టడీ మెటీరియల్ సమాచారం అందజేయాలి

గుంటూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా 10వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ నుంచి అందజేసే స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఈ నెలాఖరులోగా అందజేయాలని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయ చాంబర్లో బుధవారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యాశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ, స్టడీ మెటీరియల్ గత సంవత్సరం ఎంతమందికి పంపిణీ చేశారు, ఈ ఏడాది ఎంతమందికి పంపిణీ చేస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సమాచారాన్ని త్వరగా అందజేస్తే ముద్రించి డిసెంబరు నాటికల్లా పాఠశాలలకు అందజేస్తామని వెల్లడించారు. అదే విధంగా పాఠశాలల్లో న్యూట్రిషన్ వసతులు, సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం జిల్లా పరిషత్తు నుంచి పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. తత్ఫలితంగా పల్నాడు జిల్లా విద్యార్థిని అత్యధికంగా 598 మార్కులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇతర జిల్లాల నుంచి కూడా స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరినట్టు జడ్పీ ఛైర్‌పర్సన్ వెల్లడించారు. కార్యక్రమంలో సీఈవో జ్యోతి బసు, గుంటూరు డీఈవో రేణుక, బాపట్ల, పల్నాడు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఆవుల తిరుమలరావు, కె.ప్రభాకర్ రావు, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకు 4012 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 4012 క్యూసెక్కులనీరు బుధవారం విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 43,500 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 196 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1290 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 103 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 118 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 291 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 2600 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన పసుపు ధరలు

దుగ్గిరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పసుపుధరలు స్వల్పంగా పెరిగాయి. నాలుగు నెలలుగా క్వింటాల్ పసుపుధర రూ.10వేల లోపు ధర మాత్రమే పలికింది. ఒకదశలో క్వింటాల్ ధర రూ.8,500కు చేరుకుంది. కాగా బుధవారం జరిగిన వేలంలో క్వింటాల్ ధర రూ.11600 పలకడం పసుపు రైతుకు కొంత ఊరటనిస్తోంది. 398బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించగా. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.11,300, గరిష్టధర రూ.11,600, మోడల్‌ధర రూ.11,600 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ. 10,611, గరిష్ట ధర రూ.11,600, మోడల్‌ధర రూ. 11,300 పలికాయి.

జిల్లా పోటీలకు చిర్రావూరు హైస్కూల్ విద్యార్థి ఎంపిక

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్ లెవల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌ను పెనుమాక జడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఖోఖోలో, యోగాలో అండర్ 17 విభాగంలో చిర్రావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.శశాంత్ ఎంపికయ్యారని, పాఠశాల పీటీ సూర్యప్రకాశరావు తెలిపారు. ఎంపికైన శశాంత్‌ను హెచ్‌ఎం అరుణశ్రీ, గ్రామ పెద్దలు సీర్ల లాల్‌చంద్, సుబ్బారావు, ఎస్ఎంసీ ఛైర్మన్ భవాని తదితరులు అభినందించారు.

బాలల సంరక్షణ హక్కులపై చర్చా వేదిక

తాడేపల్లి(చిర్రావూరు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చిర్రావూరు జడ్పీ హైస్కూల్లో బుధవారం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా బాలల సంరక్షణ హక్కులపై టీచర్లతో చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలల హక్కులు అంటే జీవించే హక్కు, రక్షణ హక్కు, పాల్గొనే హక్కు, అభివృద్ధి చెందే హక్కు ఇవే మాత్రమే కాదని, పిల్లల మానసిక స్థితి తెలుసుకుని వారి భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం అరుణశ్రీ, గుడ్‌షెపర్డ్ స్టాఫ్, టీచర్లు, మహిళా పోలీస్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ వద్దు

● ఎంపీడీవో శిల్ప

తుళ్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై అశ్రద్ధ చూపవద్దని ఎంపీడీవో కానూరి శిల్ప అన్నారు. బుధవారం నెక్కల్లులో పారిశుధ్య నిర్వహణపై ఆమె తనిఖీ నిర్వహించారు. క్లోరినేషన్ వాటర్ ట్యాంకు క్లీనింగ్, తనిఖీ చేశారు. తాగునీరు, పారిశుధ్యంపై ఎల్లప్పుడు అలర్ట్‌గా ఉండాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

పెదనందిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాలు, జీడీసీఎంఎస్, మన గ్రోమోర్ కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు అధైర్యపడొద్దని మండల వ్యవసాయాధికారి ఐ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. యూరియా 150టన్నులు, డీఏపీ 100టన్నులతో పాటు ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

గుంటూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెయింట్ వేస్తూ బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి జారి పడిన పెయింటర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పత్తిపాడు మండలం రాయపాటివారిపాలెం గ్రామానికి చెందిన ముత్తనపల్లి విక్టర్‌బాబు (46) పెయింట్ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయనకు ఒక కూతురు ఉంది. ఈ నెల 17న బ్రాడీపేట 6/12వ లైన్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి విక్టర్‌బాబు మొదటి అంతస్తులో పెయింటింగ్ పని చేస్తూ ఉండగా అదే సమయంలో మార్బుల్ మిషన్ కోసం ఉపయోగించే కరెంటు వైర్ జాయింట్ సరిగా వేయకపోవడంతో కరెంటు షాక్ తగిలి కింద పడిపోయాడు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం మృతుడి భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మద్యానికి ఈ బానిసైన ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్టేషన్‌పరిధిలోని ఓబులనాయుడు పాలెం గ్రామానికి చెందిన మాసప్పగారి హరికృష్ణ (21) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఆరేళ్ల క్రితం కుమారితో వివాహం జరిగింది. వారికి కుమార్తె ఉంది. నిత్యం మద్యం తాగి వచ్చి డబ్బుల కోసం భార్యతో గొడవ పడుతుండేవాడు. దీనిలో భాగంగా బుధవారం కూడా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటిలోని దూలాలానికి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు, భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి 'మంచి ప్రభుత్వం-మన కోసం మన ఎమ్మెల్యే'

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు నేతృత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, ఈ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి 'మంచి ప్రభుత్వం-మన కోసం మన ఎమ్మెల్యే' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. కార్పొరేషన్‌లోని 8 సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బందిని కలుపుకుని, ప్రభుత్వం అందించే పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటామని అన్నారు. అమృత్-2 పథకం రూ.345కోట్లు, వీకర్ సెక్షన్ కాలనీల అభివృద్ధికి రూ.27కోట్లు మంజూరు అయ్యాయని



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు

వివరించారు. స్వర్ణభారతి నగర్ మూడో ఫేజ్ వరకు రోడ్లు, సైడు డ్రైన్లు, సెంటర్ లైటింగ్ పనులు ప్రారంభించి, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించేందుకు తలపెట్టినట్టు, పతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.వందనాదేవి, కొర్రపాటి నాగేశ్వరరావు, నక్కల అగ స్టీన్, కల్లూరి శ్రీనివాసరావు, కాసు పెంటారెడ్డి, పంచుమర్తి శేషు, మర్రి సాంబశివరావు, ఇమ్మడి మల్లికార్జునరావు, నిశ్శంకరరావు, అమర్నాద్, షేక్ షుకూర్ తది తరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో బుధవారం మండల వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉంటూ నష్ట నివారణ చర్యలను వివరించాలని అధికారులకు ఆదేశించారు. నష్ట అంచనా ఎప్పటికప్పుడు ఉన్నాతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండలాల ఏవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమాకలో డివిజన్ స్థాయి ఆటలపోటీలు

తాడేపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హైస్కూల్లో బుధవారం అండర్ 17 బాలబాలికల 69వ స్కూల్ గేమ్స్ తెనాలి డివిజన్ స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. టీడీపీ నేతలు ఈ పోటీలను ప్రారంభించారు. 8 మండలాకు చెందిన 640 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. తెనాలి డిప్యూటి డీఈవో శాంత కుమారి జెండాను ఆవిష్కరించారు. పోటీలను టీడీపీ నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కళ్లం శివగోవింద రెడ్డి, కొల్లి శేషు, పి.వీరేంద్రనాథ్, రంగబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ తెనాలి కోటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు.



డివిజన్ స్థాయి ఆటలపోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

విజేతల వివరాలు

వాలీబాల్‌లో బాలుర విభాగంలో తాడేపల్లి మండలం విన్నర్స్‌గా, దుగ్గిరాల మండలం రన్నర్స్‌గా, బాలికల విభాగంలో చేబ్రోలు మండలం విన్నర్స్‌గా, తెనాలి మండలం రన్నర్స్‌గా, కబడ్డీ బాలుర విభాగంలో తాడేపల్లి విన్నర్స్‌గా, కొల్లిపర రన్నర్స్‌గా, బాలికల విభాగంలో తాడేపల్లి విన్నర్స్‌గా, కొల్లిపర రన్నర్స్‌గా, ఖోఖో బాలుర విభాగంలో మంగళగిరి విన్నర్స్‌గా, తాడేపల్లి రన్నర్స్‌గా, బాలికల విభాగంలో మంగళగిరి విన్నర్స్‌గా, తాడేపల్లి రన్నర్స్‌గా విజయం సాధించారని తెనాలి డివిజన్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, జితేంద్రకుమార్, నాగరాజు, రజనినాయక్, రవి, భాస్కర్, హరికృష్ణ, మంజులత, మంజులవాణి, సుజాత, రాధిక, సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ బకాయిలు వంద శాతం విడుదల చేయాలి

మంగళగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రావలసిన రాయితీలను వందశాతం విడుదల చేయాలని పారిశ్రామికవేత్తలు కోరారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ ఆధ్వర్యంలో మంగళగిరిలోని పరిశ్రమలశాఖ కార్యాలయంలో బుధవారం ఆ శాఖ డైరెక్టర్ శుభమ్ బన్సాల్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. తమకు రావలసిన బకాయిలు 30శాతం కాకుండా వంద శాతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెం.7పై ఉన్న అభ్యంతరాలను తొలగించాలని, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ప్లాట్లు కేటాయించే సందర్భంలో ఇచ్చే రాయితీలను పెరుగుతున్న భూముల ధరలకు అనుగుణంగా రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని కోరారు. ఆయా సమస్యలపై డెరెక్టర్ బన్సాల్ సాను కూలంగా స్పందించారని



శుభమ్ బన్సాల్‌కు సమస్యలు విన్నవిస్తున్న పారిశ్రామికవేత్తల బృందం

జేఏసీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతి నిధులు ఈడ్పుగంటి అనార్ బాబు, ఈరా రాజశేఖర్, పినమాల నాగకుమార్, జంగాల త్రిమూర్తులు, చిన మౌలాలి, భక్తవత్సలం, కారెం శ్రీనివాస్, అన్నవరపు అవినాష్, నాగులు నాయక్, రమణమూర్తి నాయక్, బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

స్త్రీశక్తి లక్ష్యాలు సాధించేందుకు ఆర్టీసీ సిబ్బంది కృషి



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు దామోదరరావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం లక్ష్యాలను సాధించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు చెప్పారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఎస్‌కే కరీముల్లా అధ్యక్షతన జరిగింది. దామోదరరావు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకానికి సంబంధించిన రాయితీ బకాయిలు రూ.500 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి విడుదల చేయకపోవడంతో సంస్థ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిపారు. డీజిల్ కొనుగోలుకే నిధుల లేమి సమస్యగా మారిందన్నారు. స్త్రీశక్తి పథకం సాఫీగా సాగాలంటే ప్రభుత్వం ఆర్టీసీకి రాయితీ నిధులు విడుదల చేయడంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 3 వేల బస్సులను కొనుగోలు చేయాలని, పది వేల మంది సిబ్బందిని అన్ని కేటగిరీల్లోనూ నియమించాలని సూచించారు. స్త్రీశక్తి అమల్లో అధికారులు కండక్టర్లను అనవసరంగా సస్పెండ్ చేస్తున్నారని, ఉద్యోగాల నుంచి తొలగించడం వంటి చర్యలు ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, జిల్లా కార్యదర్శి ఈ.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డీవీ స్వామి, మంగళగిరి డిపో కమిటీ అధ్యక్షుడు బాడిస సాంబశివరావు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలి

తుళ్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి స్మార్ట్ సిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని ఏరియా పారిశుధ్య కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు రవి మాట్లాడుతూ రాజధాని అమరావతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్ ఉన్న ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం వద్ద రాజధాని గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులందరూ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన నేపథ్యంలో అదే రోజు రాత్రి ఏజెన్సీ నిర్వాహకులు ఆగస్టు నెల జీతాన్ని కార్మికుల అకౌంట్లో జమ చేశారని అన్నారు. 13వ తేదీన సెప్టెంబరు నెల జీతాన్ని అకౌంట్లో జమ చేయగా కొన్ని గ్రామాల్లో కార్మికులకు జమ కాలేదని అన్నారు. ఈ విషయాన్ని సీఆర్డీఏ అధికారులు, ఏజెన్సీ దృష్టికి కార్మిక సంఘం తీసుకు వెళ్లిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల అకౌంట్లో జమ చేసిన జీతం వెనక్కి వచ్చిందని, తిరిగి చెల్లిస్తామని చెబుతూ ఇప్పటివరకు కాలయాపన చేశారని అన్నారు. సాకులు చెప్పడం మాని వెంటనే వారి అకౌంట్లో పెండింగ్ జీతాన్ని జమ చేయాలని రవి డిమాండ్ చేశారు.

జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

తాడేపల్లి(వడ్డేశ్వరం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో బుధవారం స్థానిక నేతలు శంకుస్థాపన చేశారు. హైస్కూల్లో రూ.63 లక్షల 30వేల అంచనా వ్యయంతో చేపట్టిన అదనపు గదులకు టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని, ప్రభుత్వ స్కూల్స్‌ను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి కృష్ణ, కొల్లి శేషు, సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి కోటయ్య, సొసైటి డైరెక్టర్ శ్రీరాములు, హెచ్‌ఎం జోజప్ప తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ముమ్మడి సత్యనారాయణ

మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

● డీఆర్‌డీఏ ఈడీ విజయలక్ష్మీ

పెదనందిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు జీవనోపాధి పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మీ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు, అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా ఆర్థికాభివృద్ధి మెరుగుదలకు ఎన్నో పథకాలను రూపొందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మన డబ్బులు మన లెక్కలు అనే యాప్‌పై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ కిరణ్, శాప్ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ రమాదేవి, డీపీఎంలు, ఏపీ ఎం సుబ్బారావు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.28.22లక్షలు

దుగ్గిరాల (కేఆర్‌కొండూరు), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరు గ్రామంలోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవదాయశాఖ గుంటూరు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట శ్రీనివాసులు పర్యవేక్షణలో కానుకల లెక్కింపులో మొత్తం రూ.28,22,339ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు. కానుకల లెక్కింపులో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భూ సేకరణపై ప్రజలతో మాట్లాడండి

● కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

మేడికొండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, నడికుడి మీదుగా సికింద్రాబాద్ వెళ్లే రైలు మార్గంలో భూసేకరణ ద్వారా భూములు సేకరిస్తున్న రైల్వే అధికారులు ముందుగా ఆయా గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మేడికొండూరులోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక అధికారులతో కలిసి రైల్వే అధికారులు గ్రామస్థుల నుంచి అంగీకార పత్రాలను తీసుకోవడాన్ని రామకృష్ణ అడ్డుకున్నారు. మండలంలోని సిరిపురం, మందపాడు, విశదల గ్రామాల్లో సుమారు 35ఎకరాల భూమి 2వందల వరకు నివాస గృహాలు, స్థలాలు కోల్పోతున్నారని, గ్రామసభ ద్వారా వీరికి అవగాహన కల్పించకుండా ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి గుట్టుచప్పుడు కాకుండా అంగీకార పత్రాలు తీసుకోవడం భూసేకరణ చట్టానికి విరుద్ధమని చెప్పారు. రైల్వే అధికారులు సేకరించిన భూములు బహిరంగ మార్కెట్లో ఎకరం రూ.40 లక్షలు ఉండగా కేవలం ఎనిమిది లక్షలు మాత్రమే ఇస్తామని ప్రకటించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అప్పటికే అంగీకార పత్రాలు ఇవ్వటానికి వచ్చిన రైతులు వాటిని ఇవ్వకుండానే తిరిగివెళ్లారు. గ్రామసభ ద్వారా అంగీకార పత్రాలు తీసుకోవాలని వారు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు సమావేశం వాయిదా వేసి విషయాన్ని పై అధికారులకు తెలియజేస్తామని వెళ్లారు.

జడ్పీ చైర్‌పర్సన్‌తో ఎమ్మెల్యేల భేటీ

గుంటూరు సిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, బూర్ల రామాంజనేయులు బుధవారం భేటీ అయ్యారు. ఛైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గంలో పంచాయతీరాజ్ ద్వారా జరుగుతున్న పనులపై చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

చిరుమామిళ్ళకు టీడీపీ నాయకుల నివాళి

వట్టిచెరుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు చిరుమామిళ్ళ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం చిరుమామిళ్ళ కుటుంబ సభ్యులతో కలసి స్థానిక టీడీపీ నాయకులు స్వర్గీయ చిరుమామిళ్ళ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఏదుపాటి శివయ్య, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జెట్టి సుబ్బారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు కొత్తపల్లి నాగేశ్వరరావు, కొత్తపల్లి తిరుపతిరావు, అప్పాపురం నీటి ఛానల్ ఉపాధ్యక్షుడు కల్లూరి తిరుపతిరావు, గ్రామ ఉపసర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయణ, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఫిరంగిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు విద్యార్థులకు నూతన ఆధార్ కార్డులను ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని బుధవారం ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం తెలిపారు. ఎర్రగుంట్లపాడు సచివాలయంలో 23, 25 తేదీల్లో, 113 తాళ్ళూరు సచివాలయంలో 27, 30 తేదీల్లో, మునగపాడు జడ్పీ హైస్కూల్లో ఈనెల 23, 25 తేదీల్లో, నుదురుపాడు జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 27, 30 తేదీల్లో, వేములూరిపాడు జడ్పీ హైస్కూల్లో 23, 30, ఫిరంగిపురం సెయింట్ పాల్స్ హైస్కూల్లో ఈనెల 23, 30 తేదీల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు జడ్పీ పాఠశాల విద్యార్థులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, చిలకలూరిపేట, ఏఎంజీ ఉన్నత పాఠశాలలో 21న జరిగిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లలో అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు వడ్లమాను మహిత, పి.దీప్తి సత్తాచాటారు. అండర్-14 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నవంబరు మొదటి వారంలో చిత్తూరు జిల్లా, మదన పల్లె జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రధానోపాధ్యాయిని చావలి సరోజిని, పీడీ గంగిరెడ్డి నాగిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు రామచంద్రరావు, హనుమంతరావు, గంగాధరరెడ్డి, కమిటీ సభ్యులు పుల్లారెడ్డి తదితరులు అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డీఎల్‌ఐ, డీఎల్‌ఆర్ అంశాలపై సమీక్ష

● సీఆర్డీఏ అధికారులతో అడిషనల్ కమిషనర్ భార్గవతేజ



సీఆర్డీఏ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అడిషనల్ కమిషనర్ భార్గవతేజ

తుళ్లూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజారాజధాని అమరావతి నగర అభివృద్ధి మౌలిక వసతుల ప్రాజెక్టులో అంతర్భాగంగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (డబ్ల్యూబీ, ఏడీబీ) నిర్దేశించిన డిస్‌బర్స్‌మెంట్ లింక్డ్ ఇన్స్టెంటిప్స్ (డీఎల్‌ఐ), డిస్‌బర్స్‌మెంట్ లింక్డ్ రిజల్ట్(డీఎల్‌ఆర్) అంశాలపై సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ తేజ విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. డబ్ల్యూబీ, ఏడీబీ బృందంతో ఇటీవల చర్చించిన అంశాలపై అడిషనల్ కమిషనర్ ఈ సమావేశంలో మాట్లాడారు. డీఎల్‌ఐ డీఎల్‌ఆర్, అంశాల్లో అంతర్భాగమైన హౌసింగ్ కార్యకలాపాలు, ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక వనరులు, అకౌంట్స్ నిర్వహణ, వరద నీటి నిర్వహణకై చేపట్టిన కార్యకలాపాల పురోగతి, సామాజిక, పర్యావరణ సంక్షేమం, రాజధానిలో మహిళలతో సమావేశాల నిర్వహణ తదితర అంశాల పురోగతి కోసం అడిషనల్ కమిషనర్ చర్చించారు. అధికారులు, సిబ్బందికి తగిన ఆదేశాలిచ్చారు. వచ్చే నెలలో విశాఖపట్నం వేదికగా జరగనున్న సీఐఐ సమ్మిట్‌లో సీఆర్డీఏ ద్వారా నిర్వహించాల్సిన కార్యకలాపాల గురించి అడిషనల్ కమిషనర్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో సీఆర్డీఏ స్ట్రాటజీ విభాగ డైరెక్టర్ అడుసుమిల్లి ఉమ, సీఆర్డీఏలోని ముఖ్య అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్లో ఆర్వో ప్లాంట్ పునరుద్ధరణ

మంగళగిరి సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి జడ్పీ హైస్కూల్లో ఆర్వో ప్లాంటును మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పునరుద్ధరించారు. రూ.50 వేల వ్యయంతో ఆర్వో ప్లాంటును పునరుద్ధరించి, రెండు సంవత్సరాలకు సరిపడా నిర్వహణకు తగిన వనరులను సమకూర్చారు. వాటర్ ప్లాంటును మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, వాటర్ ట్యాంకును పీడీజీ పీడీజీ రత్నప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని శైలజ, రోటరీ చార్టర్డ్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, కార్యదర్శి నిరంజన్ గుప్తా, పాస్ట్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్, జొన్నాదుల బిక్షారావు, మాదల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంటును ప్రారంభించి విద్యార్థులకు మంచినీరు అందజేస్తున్న కిరణ్‌చంద్, రాజశేఖర్ తదితరులు

లైంగింక వేధింపుల నియంత్రణ చట్టంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీఎస్ఐ హరికృష్ణ

దుగ్గిరాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో జీవించేందుకు వీలైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతిఒక్కరిపైనా ఉందని దుగ్గిరాల పీఎస్ఐ బి.హరికృష్ణ తెలిపారు. చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రం సెక్సువల్ అబ్యూజ్ అనే అంశంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో హరికృష్ణ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పిస్తూ, వారిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లైంగిక వైధింపులకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకునేందుకు పలుచట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. విద్యార్థులు సోదర భావంతో మెలగాలన్నారు. కళాశాల సీఎస్ఈ, ఈసీఈ, తదితర విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆదుకోవడం అభినందనీయం : ఎంఈవో

పెదనందిపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ఆదుకోవడం అభినందనీయమని ఎంఈవో జాకబ్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దాత కమ్మ గీతాహారిక అందించిన కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులపై శ్రద్ధ చూపాలని వారికి ప్రభుత్వంతో పాటు దాతలు చేయూతనందిస్తున్నారన్నారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టు అందుబాటులో ఉన్నారని క్రమం తప్పకుండా వ్యాయామం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీఎస్ పూర్ణచంద్రరావు, పరిమళ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో జాకబ్

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

తాడేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాకలో రూ.4,63,590ల విలువలైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితుల ఇళ్లకు వెళ్లి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు తదితరులు అందజేశారు. పెనుమాకకు చెందిన బోన ప్రభాకరరెడ్డికి రూ.2,34,562లు, మన్నవ మాలతికి రూ.1,42,000లు, అల్లు మాధవికి రూ.30,028లు విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బుధవారం పంపిణీ చేశారు. ఉండవల్లిలో గోగు హరిప్రసాద్‌కు రూ.73,129లు, దుర్గం నవ్యశ్రీకి రూ.42,605లు, పి.లిఖితకు రూ.25,574ల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. గుండిమెడలో గోనుగుంట్ల కుమారస్వామికి రూ.41,048ల విలువైన చెక్కును లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నేతలు దాసరి కృష్ణ, వంగా నరేంద్ర, దొప్పలపూడి జ్యోతిబసు, గాదె బసివిరెడ్డి, గాదె శ్రీను, కూనపరెడ్డి రమేష్, రాము, ప్రమీల, బాబూరావు, కొల్లి శేషు, పాలెపు వీరేంద్రనాథ్, పఠాన్ జానీ ఖాన్, షేక్ అయూబ్, ఖాదర్, కోట పృథ్వీ, చిగురుపాటి సుబ్బారావు, నామతోటి రాంబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పెనుమాకలో చెక్కు అందజేస్తున్న కొల్లి శేషు తదితరులు

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

మంగళగిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ఈ నెల 23వ తేదీన జరుగనున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ నేత రవి పిలుపునిచ్చారు. ఎర్రబాలెంలో బుధవారం కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పంచారామాలకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు: డీఎం రాజశేఖర్

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకుని పంచారామాలకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడుపుతోందని డిపో మేనేజర్ రాజశేఖర్ బుధవారం తెలిపారు. సర్వీసుల వివరాలతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అమరావతి, సామర్లకోట, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం క్షేత్రాలకు ప్రతి శని, ఆదివారాల్లో రాత్రి 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. శ్రీశైలదర్శిని పేరుతో ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేశామన్నారు.



రోడ్డుపై చిందర వందరగా ఉన్న వైర్లు

రోడ్డుపైనే కేబుల్ వైర్లు

● ప్రమాదాల బారిన వాహన చోదకులు

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మారీసుపేట ఎరువుల కొట్ల బజారులో రోడ్డుపై కేబుల్ వైర్లు చిందర వందరగా పడి ఉన్నాయి. దీపావళి బాణాసంచా నిప్పు రవ్వలు పడి విద్యుత్ స్తంభం వద్ద వైర్లు దహనమైన సంగతి తెలిసిందే. దహనం కాగా మిగిలిన వైర్లు అన్నీ రోడ్డుపై పడిపోయాయి. రోజులు గడుస్తున్నా వీటిని సంబంధిత కేబుల్ ఆపరేటర్లు గాని ఇంటర్నెట్ సిబ్బంది కాని మున్సిపల్ సిబ్బంది గాని తొలగించకపోవడంతో వాహనాలపై వెళ్లే వారికి అడ్డంపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

26న వడ్లమూడి చారిటీస్ స్కాలర్‌షిప్‌లు

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటీస్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేస్తామని ట్రస్టీలు వడ్లమూడి గోవిందరావు, బసవప్రసాద్, బసవరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని ఎన్వీవో కల్యాణ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో ఆర్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ గంటా సుధావాణి, విశ్రాంత ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు.

హనుమాన్‌పాలెం శివాలయంలో నగలు మాయం

కొల్లిపర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాన్‌పాలెం శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నగలు మాయం అవ్వటంపై కేసు నమోదైంది. ఎస్‌ఐ కోటేశ్వరరావు వివరాలు తెలిపిన ప్రకారం హనుమాన్‌పాలెం శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో రేపల్లె శివారు బేతపూడికి చెందిన పన్నాల జయరావుశర్మ 22సంవత్సరాలు పూజారిగా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల నుంచి ఇతను గుడికి సరిగా రావటం లేదు. కానీ అతను దేవస్థానం దగ్గరే ఉంటున్నాడు. తల్లిదండ్రులు అదే ఇంట్లోనే ఉంటున్నారు. పూజారి జయరావు శర్మ తండ్రి కృష్ణమూర్తి మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. పూజారి తండ్రి మృతదేహాన్ని కుటుంబసభ్యులు వచ్చి స్వగ్రామమైన బేతపూడికి తీసుకెళ్లారు. తండ్రి చనిపోయినా జయరావు శర్మ రాకపోవడంతో శివాలయం ధర్మకర్త కొల్లి కోటిరెడ్డి, గ్రామపెద్దలు అనుమానం వచ్చి అమ్మవారి నగలను పరిశీలించగా బంగారుతాడు, రెండుసూత్రాలు, నల్లపూసలగొలుసు, వడ్డాణం, అరవంకీ, రెండు గాజులు, బొట్టుబిళ్ల, పాపిడి చైన్, మాటీలు ఒరిజినల్ నగల స్థానంలో రోల్డ్‌గోల్డ్ నగలు ఉన్నట్లు గమనించారు. భక్తులు చేయించిన సుమారు రూ.20లక్షలు విలువైన నగలు మాయమవటంతో కొల్లిపర పోలీసుస్టేషన్‌లో ధర్మకర్త కోటిరెడ్డి, గ్రామపెద్దలు ఫిర్యాదు చేయగా కేసునమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



శ్రీహర్ష చౌదరి

పెదకాకాని, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నంబూరు గ్రామంలోని వీవీఐటీ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మార్నేని శ్రీహర్షచౌదరి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4.00గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటకువెళ్లి తిరిగిరాలేదు. విద్యార్థి అదృశ్యంపై అతని తల్లి మార్నేని ప్రవీణ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని గురించి సమాచారం తెలిసిన వారు పెదకాకాని సీఐ: 8688831350, ఎస్‌ఐ: 8688831352కు సమాచారం తెలపాలని కోరారు.

పెళ్లి పేరుతో మోసగించాడని యువతి ఫిర్యాదు

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి వంశీ అనే వ్యక్తి తనను మోసం చేశాడని ఓ యువతి బుధవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. తెనాలికి చెందిన సేతు వంశీతో పరిచయం ఏర్పడి అతను చెప్పిన మాటలు నమ్మి అతనితో సహజీవనం చేస్తున్నానని తెలిపింది. ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నామని బంగారం అమ్ముకుని అవసరం తీరిన తరువాత తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసునమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

గుంతలమయంగా వడ్లమూడి అడ్డరోడ్డు కూడలి

● ఇక్కట్లు పడుతున్న వాహన చోదకులు



గుంతలతో నిండిపోయిన వడ్లమూడి అడ్డరోడ్డు



వడ్లమూడి అడ్డరోడ్డు కూడలిలో ఉన్న గుంతలో నిలిచి ఉన్న నీరు

చేబ్రోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-తెనాలి ప్రధాన రహదారిలోని వడ్లమూడి అడ్డరోడ్డు ప్రాంతంలో రోడ్డు గుంతలతో నిండిపోయింది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ మార్గంలో ఎక్కడ చూసినా భారీ గుంతలే కనిపిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఆ గుంతలు నీటితో నిండిపోవడంతో రోడ్డు పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రధాన కూడలిగా ఉన్న ఈ ప్రాంతానికి నిత్యం శలపాడు, వడ్లమూడి నుంచి ప్రయాణికులు చేరుకుంటారు. తెనాలి, గుంటూరు వైపు ప్రయాణించే వాహనాలు పెద్దఎత్తున వెళ్తుండటంతో రద్దీ మరింతగా పెరిగింది. ఈ కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు గుంతలు పూడ్చకపోతే ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని సంబంధిత శాఖ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

కుంభవృష్టితో రోడ్లు జలమయం



కొల్లిపరలో వర్షానికి జలమయమైన రోడ్డు



కొల్లిపర: తూములూరులో నీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

కొల్లిపర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బుధవారం ఉదయం కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించింది. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. అధికంగా వర్షం నీరు చేరడంతో గృహాల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గజం లోతు నీరు చేరడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోయాయి. శివాలయం దగ్గర నుంచి గ్రామ పంచాయతీ వరకు నీటితో నిండిపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

జనజీవనం అస్తవ్యస్తం



పొన్నూరు: వర్షంతో జీబీసీ రోడ్‌లో నిలిచిన వర్షపు నీరు

పొన్నూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ, మండలంలో బుధవారం ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఉదయం నుంచే వర్షం కురుస్తుండటంతో రహదారులపై పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచి ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది. పొన్నూరు పట్టణ, మండలంలో పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి అసౌకర్యానికి ప్రజలు గురయ్యారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్ వరిపైరు ఈనిక దశలో ఉంది. ఈ దశలో వర్షాలు కురుస్తే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దాడి చేసిన యువకుల అరెస్టు

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో ఆటోడ్రైవర్ షేక్ రహమాన్, అతని కుటుంబ సభ్యులపై దాడిచేసి గాయపరిచిన యువకుల ముఠాను త్రీ టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. సీఐ సాంబశివరావు విలేకరుల సమావేశంలో సంఘటనా వివరాలను వెల్లడించారు. సీఎం కాలనీ ఒకటో లైనులో ఆటోడ్రైవర్ షేక్ రహమాన్ కుటుంబం ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఆ ఇంటి వద్ద ఉండే 16 సంవత్సరాల రాఘవ అనే పిల్లవాడిని అదే కాలనీకి చెందిన యువకులు అకారణంగా కొడుతుండటంతో రహమాన్ కుటుంబం ఆ యువకులను అడ్డుకున్నారు. ఇది అవమానంగా భావించిన యువకులు తిరిగి సోమవారం రాత్రి యువకులు హన్ను, గరిక నాంచారయ్య, షేక్ ఆరీఫ్, మొవ్వా తిరుపతిరావు కలిసి కర్రలు, బీరు బాటిల్స్‌తో షేక్ రహమాన్ ఇంటిపై దాడి చేసి రహమాన్ తలపై బీరుబాటిల్స్‌తో తీవ్ర గాయాలు చేసి భార్య, పిల్లలపై కర్రలతో దాడి చేశారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

సుంకాలను నిరసిస్తూ ట్రంప్ చిత్రాల దహనం

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై భారీ సుంకాలను నిరసిస్తూ సీపీఎం కార్యకర్తలు బుధవారం ట్రంప్ చిత్రపటాలను దహనం చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం కంచర్లపాలెంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ, సుంకాల కారణంగా మన దేశంలోని పాడి పరిశ్రమ ఇబ్బందులు పడుతుందన్నారు. వ్యవసాయరంగం కూడా ప్రమాదంలో ఉందన్నారు. దేశంలోని రైతులు రోడ్డుపైపడే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. పాలకులు ప్రత్యామ్నాయ మార్గాలు అవలంబించి పాడి పరిశ్రమను, వ్యవసాయ రంగాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, వాసు, రమేష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా పాటిబండ్ల

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అఖిల విద్యార్థి పరిషత్ నూతన నగర కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నగర కమిటీ అధ్యక్షుడిగా పాటిబండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా రేవంత్, సభ్యులను ఎంపికచేసి ప్రకటించారు. జిల్లా కన్వీనర్ వంశీ మాట్లాడుతూ, కమిటీ సభ్యులు విద్యార్థుల సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో సమస్యలను అధ్యయనం చేయాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించే కాన్వెంట్లపై దృష్టి పెట్టాలని, విద్యార్థులను మానసిక ఒత్తిడి గురిచేసే చర్యలను అడ్డుకోవాలని సూచించారు.

బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్ల ఆందోళన

తెనాలి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు గ్రామ పంచాయతీ అధికారులు నిధులు డ్రాచేసుకుని తమ బకాయిలు నిలిపివేశారంటూ బుధవారం కాంట్రాక్టర్లు గ్రామ పురవేదిక వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో పంచాయతీ అధికారులపై వారు పలు ఆరోపణలు చేశారు. గ్రామంలో డయేరియా సోకిన సమయంలో ఇక్కడి వారికి భోజనం ఏర్పాటు చేశారని, దీనికిగాను రూ.2.14లక్షలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు మాత్రమే ఇచ్చారని సుద్దపల్లి నళిని ఆరోపించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి గుంటూరు కృష్ణమోహన్ సూచన మేరకు గ్రామంలో డయేరియాతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే తాగునీరు సరఫరా కోసం 3357 ట్యాంకర్లు సరఫరా చేశానని, ఒప్పందం ప్రకారం గ్రామ పంచాయతీ రూ.6.47 లక్షలు చెల్లించాలన్నారు. పంచాయతీ అధికారులు రూ.1.30 లక్షలు చెల్లించి మిగిలిన బిల్లులపై సమాధానం చెప్పడం లేదని సరఫరాదారుడు ఏపూరి వీరవెంకటసత్యనారాయణ వాపోయారు. 2004 నుంచి గ్రామంలోని ఎస్సీ కాలనీలో లైబ్రరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్నానని, నాలుగు సంవత్సరాలుగా జీతం చెల్లించకుండా పంచాయతీ అధికారులు ఇక్కట్లుకు గురి చేస్తున్నారని బాధితురాలు రావూరి రత్నరాణి ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పసుపులేటి పిచ్చయ్య, మత్తే వీరరాఘవయ్య, కోళ్ల కోటేశ్వరరావు, సుద్దపల్లి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో డివిజన్ స్థాయి ఆటలపోటీలు

తాడేపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక జడ్పీ హై స్కూల్లో బుధవారం అండర్ 17 బాలబాలికల 69వ స్కూల్ గేమ్స్ తెనాలి డివిజన్ స్థాయి ఆటలపోటీలను నిర్వహించారు. టీడీపీ నేతలు ఈ పోటీలను ప్రారంభించారు. 8 మండలాకు చెందిన 640మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. తెనాలి డిప్యూటీ డీఈవో శాంత కుమారి జెండాను ఆవిష్కరించారు. పోటీలను టీడీపీ నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కళ్లం శివగోవిందరెడ్డి, కొల్లి శేషు, పి.వీరేంద్రనాథ్, రంగబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. విజేతల వివరాలు... వాలీబాల్‌లో బాలుర విభాగంలో తాడేపల్లి మండలం విన్నర్స్‌గా, దుగ్గిరాల మండలం రన్నర్స్‌గా, బాలికల విభాగంలో చేబ్రోలు మండలం విన్నర్స్‌గా, తెనాలి మండలం రన్నర్స్‌గా, కబడ్డీ బాలుర విభాగంలో తాడేపల్లి విన్నర్స్‌గా, కొల్లిపర రన్నర్స్‌గా, బాలికల విభాగంలో తాడేపల్లి విన్నర్స్‌గా, కొల్లిపర రన్నర్స్‌గా, ఖోఖో బాలుర విభాగంలో మంగళగిరి విన్నర్స్‌గా, తాడేపల్లి రన్నర్స్‌గా, బాలికల విభాగంలో మంగళగిరి విన్నర్స్‌గా, తాడేపల్లి రన్నర్స్‌గా నిలిచారని తెనాలి డివిజన్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు తెలిపారు.




సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ హరిబాబు తదితరులు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

● డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరపనున్నట్లు జిల్లా మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు వడ్డాణం హరిబాబు చెప్పారు. తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం ఎంఎస్‌సీ రేటుకు అనుగుణంగా ధాన్యం సేకరించాలన్నారు. రైతులను పదే పదే తిప్పకుండా తగిన సూచనలు అందించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తేమశాతం ముందుగానే సరిచూడాలని, రైతులకు అన్ని అంశాలలో అవగాహన కల్పించాలని చెప్పారు. సాధారణ రకం ధాన్యానికి క్వింటా రూ.2369, ఏ రకం గ్రేడ్‌కు రూ.2389 ధర నిర్ణయించిందని చెప్పారు. ఈ ప్రకారం 75కిలోల ధాన్యానికి లెక్కవేసి రైతులకు వివరించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపులు కూడా జరుగుతాయన్నారు. సివిల్ సప్లయిస్ ఎండీ తులసి, హరగోపాల్, తహసీల్దార్లు కేవీ గోపాలకృష్ణ, సిద్ధార్థ, సునీత, కె.విజయ్‌బాబు, ఏవోలు పాల్గొన్నారు.



సంతాన వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు, మహిళలు

సంతాన వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఇస్కాన్ ప్రతినిధులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామోదర మాసం ప్రారంభం సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సమూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా దామోదరాష్టకం పఠించారు. ఇస్కాన్ గురు కీర్తిరాజుప్రభూజీ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన భక్తి పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



నూతన ఉపాధ్యాయులకు సర్వీసు రిజిస్టర్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారంతా విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం డీఎస్సీలో ఉద్యోగాలు సాధించినవారికి సర్వీస్ రిజిస్టర్లు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శులు షకీలాబేగం, సాంబశివరావు, సౌజన్య, సుందరరావు, కరిముల్లా పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

చేబ్రోలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని నారాకోడూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7,8,9వ తరగతి విద్యార్థుల కోసం 'స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం-2025'ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల అవసరంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ భూమి ఆరోగ్యం కాపాడటానికి భూసార పరీక్షలు ఎంతో అవసరం అన్నారు. భూసార పరీక్ష కేంద్రం గుంటూరు వ్యవసాయ అధికారి ఝాన్సీ మట్టి నమూనాల సేకరణ విధానం, జాగ్రత్తల గురించి వివరించారు. 50మంది రైతులను రిజిస్టర్ చేసి పొలాల జియో కోఆర్డినేట్స్, క్యూఆర్ కోడ్ ద్వారా నమూనాలు సేకరించి, ఫలితాలను యాప్‌లో పొందుపరచి, విశ్లేషణ కార్డులు రైతులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు, ఎస్‌టీఎల్‌ఏవో ఝాన్సీ అధికారులు శ్రీరంజని, అరుణ, ప్రియదర్శిని, విస్తరణ అధికారి మోహన్, వీహెచ్‌ఏ కే.విజయ్‌కుమార్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో మృతిచెందిన కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణ శివారులో పిడుగుపాటుకు గురైన వలపర్ల కమలమ్మ, షేక్ ముజాహిద కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బుధవారం ఫోన్లో పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. పిడుగుపాటుకు గాయపడిన నీల మాణిక్యం కుటుంబాలకు తక్షణ సహాయ చర్యలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. మహిళల మృతి గురించి కలెక్టర్ తమీమ్ అన్సారియా, సబ్‌కలెక్టర్ తదితర అధికార యంత్రాంగంతో మాట్లాడి సహాయ చర్యలు అందించాల్సిందిగా సూచించారు. అలాగే స్థానిక సీఐ వీరానాయక్, తహసీల్దార్ జియావుల్‌హక్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులను సంప్రదించి తక్షణమే మృతదేహాలకు పరీక్షలు పూర్తిచేసి మృతుల కుటుంబాలకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తామని వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ హామీ ఇచ్చారు.



హోమ్ కంపోస్టు తయారీ వివరిస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

హోమ్ కంపోస్టు తయారు చేసుకోవాలి

● కమిషనర్ అప్పలనాయుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రతి ఇంటిలో మహిళలు హోమ్ కంపోస్టు తయారుచేయడానికి ముందుకు రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని కొత్తపేటలో లక్ష్మీగణపతి అపార్ట్‌మెంట్ మహిళలకు బుధవారం కంపోస్టు తయారుచేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోజు వేల టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, దీనిని అధిగమించేందుకు హోమ్ కంపోస్టు విధానం మెరుగైందన్నారు. వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ, హోమ్ కంపోస్టు తయారు చేసుకుంటే ప్రతి ఇంటిలో మొక్కలకు ఎరువు లభిస్తుందన్నారు. కమిషనర్ అప్పలనాయుడు వ్యర్థాల సెగ్రిగేషన్, కంపోస్టు చేసే విధానాన్ని స్వయంగా వివరించారు.



నరేంద్రనాథ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, పక్కన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నన్నపనేని రాజకుమారి తదితరులు

వ్యాపారవేత్త నరేంద్రనాథ్ విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చినరావూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పాటిబండ్ల నరేంద్రనాథ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం ఆవిష్కరించారు. చినరావూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం డీఎస్సీలో ఉద్యోగాలు సాధించినవారిని సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు, మహ్మద్ ఖుద్దూస్, అన్నపూర్ణ, హర్షవర్ధన్, మౌనిక, జొన్నాదుల మహేష్, త్రిమూర్తి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలు ఉంటే గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ఏపీకి ప్రత్యేక అవకాశం కల్పించినట్లు తెలిపారు. నవంబరు 5వ తేదీలోపు అర్హులైన వారు ఉంటే గృహనిర్మాణ శాఖ ఏఈ కార్యాలయంలో దరఖాస్తును అందజేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల ఆధార్‌కార్డు బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయడం కోసం గ్రామాల్లోని సచివాలయాల్లో ఈ నెల 23నుంచి 29వరకు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆధార్ సెంటర్‌ను మండల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్‌లో ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే సరిచేయించుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మూర్తి పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలించాలి: ఎంపీడీవో

కొల్లిపర, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని తూములూరులో సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. సచివాలయాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

పొన్నూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మృతి చెందిన వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి బొనిగల ప్రభుదాస్ బుధవారం ప్రభుత్వాన్ని కోరారు. మృతులకు నివాళులర్పించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళా కూలీకి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.